నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ బుధవారం 4-11-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:79 పేజీలు: 4 వెల: రూ.1/-

ప్రశాంతంగా ముగిసిన దుబ్బాక పోలింగ్

6 గంటలలోపు క్యూలైన్‌లో ఉన్నవారికి ఓటేసే అవకాశం
సాయంత్రం 5 గంటల వరకు 81.44 శాతం పోలింగ్
పోలింగ్ శాతం పెరగనుందని అన్న అధికారులు

సిద్దిపేట,నవంబర్3(ఆర్ఎన్ఎ): ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న దుబ్బాక ఉపఎన్నిక పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ప్రశాంతంగా ముగిసింది. 6 గంటలలోపు క్యూలైన్‌లో ఉన్నవారికి మాత్రమే ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల మధ్య కరోనా రోగులకు అవకాశం ఇచ్చారు. దుబ్బాక డిగ్రీ కళాశాలలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు రోగులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. వారిని 108 వాహనంలో పోలింగ్ కేంద్రానికి తీసుకొచ్చారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 85 శాతానికిపైగా ఓటింగ్ నమోదైంది. ఈ ఉపఎన్నికలో సాయంత్రం 5 గంటల వరకు 81.44 శాతం ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. పోలింగ్ పూర్తయ్యే సరికి ఇది మరింత పెరిగే అవకాశముంది. పెద్ద ఎత్తున పోలింగ్ నమోదు కావడంతో ఆయా పార్టీల నేతలు అంచనాల్లో మునిగిపోయారు. పోలింగ్ సరళిపై నియోజకవర్గంలోని గ్రామాల నుంచి నివేదికలు తెప్పించుకుని విశ్లేషించుకుంటున్నారు. అయితే సాయంత్రం 5 గంటల వరకే సాధారణ ఓటర్లకు ఓటేసేందుకు అవకాశం కల్పించారు. చివరి గంటలో కేవలం కొవిడ్ రోగులకు మాత్రమే ఓటు వేసేందుకు వెసులుబాటు కల్పించారు. మొత్తం 23 మంది అభ్యర్థులు ఈ ఉప ఎన్నికల బరిలో ఉన్నారు. వీరి భవితవ్యాన్ని ఓటర్లు ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. అభ్యర్థుల భవితవ్యం 10వ తేదీన తేలనుంది. దుబ్బాక నియోజకవర్గం పరిధిలో పట్టణ పురపాలక విభాగం, దుబ్బాక, తొగుట, మిరుదొడ్డి, దౌల్తాబాద్, రాయపోల్ మండలాలు, మెదక్ జిల్లాలోని చేగుంట, నార్సింగి మండలాల్లో మొత్తం 315 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సమస్యాత్మకమైన 89 పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. 400 మంది పీవోలు, 400 మంది ఏపీవోలు, 800 మంది అదనపు పోలింగ్ అధికారులు ఎన్నికల విధులు నిర్వర్తించారు.



దుబ్బాకలో పోలింగ్ సరళిని పరిశీలించిన కలెక్టర్ భారతి హోళికేరి

దుబ్బాకలో ఓటేయడానికి క్యూలో చేరిన ఓటర్లు

పలు ప్రాంతాల్లో మొరాయించిన ఇవిఎంలు

ఉదయమే ఓటేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు

సిద్దిపేట,నవంబర్3(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. మంగళవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. పలు ప్రాంతాల్లో ఇవిఎంలు మొరాయించాయి. దీంతో ప్రజలు క్యూలో నిలబడ్డారు. దుబ్బాక నియోజకవర్గం గ్రామీణ ప్రాంతం కావడంతో వ్యవసాయదారులు పనులకు వెళతారుకాబట్టి ఉదయమే తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తరలి వచ్చారు. కోవిడ్ నిబంధనలకు అనుగుణంగా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ఓటర్లకు టెంపరేచర్ చెక్ చేసి మాస్క్‌లు, గ్లౌజులు అందజేస్తున్నారు. భౌతికదూరం పాటించేలా అన్నిరకాల చర్యలు తీసుకున్నారు. పోటీలో 23 మంది అభ్యర్థులు ఉన్నప్పటికీ ప్రధాన పోటీ టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్యే ఉంది. టీఆర్ఎస్ నుంచి సోలిపేట సుజాత, బీజేపీ నుంచి రఘునందన్‌రావు, కాంగ్రెస్ నుంచి శ్రీనివాసరెడ్డి బరిలో ఉన్నారు. దీంతో ముక్కోణపు పోరుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. పోలింగ్ సరళిని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి శశాంక్ గోయల్ పరిశీలించారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు 55.52 శాతం పోలింగ్ నమోదైంది. కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయిం చాయి. చేగుంటలో దొంగ ఓటు నమోదయ్యింది. అసలు ఓటరు రావడంతో అధికారులు గుర్తించారు. తన ఓటు వేరేవారు వేశారని అసలు ఓటరు ఆందోళన వ్యక్తం చేశారు. తమ్ముడి ఓటు అన్న వేసి వెళ్లారు. పోలింగ్ ఏజెంట్‌కి తెలిసే జరిగిందని అసలు ఓటరు ఆరోపించారు. ఓటరు ఆందోళనతో టెండర్ ఓటుకు ప్రిసైడింగ్ ఆఫీసర్ అనుమతి ఇచ్చారు.

ఓటు హక్కు వినియోగించుకున్న అభ్యర్థులు

ఎమ్మెల్యే అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీఆర్ఎస్ అభ్యర్థి సోలిపేట సుజాత.. దుబ్బాక మండలం చిట్టాపూర్ గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు.. తన స్వగ్రామమైన బొప్పాపూర్‌లో ఓటు వేశారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్ రెడ్డి.. తోగుట మండలంలోని తుక్కాపూర్ గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్లు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నేతలు సూచించారు. నియోజకవర్గంలోని మొత్తం 7 మండలాల్లోని 148 గ్రామాల్లో 315 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ కొనసాగుతోంది. ఎలక్షన్ అధికారులు కరోనా నిబంధనలు పాటిస్తూ పోలింగ్ నిర్వహిస్తున్నారు. కాగా.. కరోనా లక్షణాలున్న వారికి మాత్రం సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఓటు వేయడానికి అవకాశం కల్పించారు. ఇక్కడ మొత్తం 23 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్..

లచ్చపేటలోని దుబ్బాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళ్ళీకేరి పరిశీలించారు. ఈ మేరకు కోవిడ్ నిబంధనల మేరకు

ప్రతీ ఓటరుకు థర్మల్ స్క్రీనింగ్ చేసి, శానిటైజరు అందిస్తూ.. చేతికి గ్లౌజు ఇవ్వడంతో పాటు సామాజిక దూరం పాటించేలా చర్యలు తీసుకున్న ఎన్నికల అధికారుల పనితీరును కలెక్టర్ అభినందించారు.

48 గ్రామాల్లో 315 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. 89 సమస్యాత్మక కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. 23 మంది బరిలో ఉన్నా.. ప్రధాన రాజకీయ పార్టీలైన టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్యే పోటీ ఉంది. ఇంటింటి ప్రచారంలో ప్రతీ ఓటరును నేరుగా కలిసి, ఫోన్లు చేసి తమ పార్టీకి ఓటు వేయాలని అభ్య ర్థించారు. రాజ కీయ పార్టీలు ఈ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో పోలింగ్ శాతం గతంలో కన్నా పెరిగే అవ కాశముందని భావిస్తున్నారు. దుబ్బాకలో మొత్తం ఓటర్లు 1,98,807 మంది కాగా, పురుష ఓటర్లు 98,028 మంది.. మహిళా ఓటర్లు 1,00,719 మంది ఉన్నారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన ఎన్నికల ప్రధానాధికారి

దుబ్బాక ఉప ఎన్నిక పోలింగ్ సరళిని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి శశాంక్ గోయల్ పరిశీలించారు. లచ్చపేటలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి.. పోలింగ్ సరళిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శశాంక్ గోయల్ మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేశామన్నారు. కొవిడ్ జాగ్రత్తలతో పోలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. దుబ్బాకలో ప్రశాంత వాతావరణంలో ఉప ఎన్నిక పోలింగ్ కొనసాగుతుందని చెప్పారు. ఈవీఎంలో సాంకేతిక సమస్యల పరిష్కారానికి నిపుణులను అందుబాటులో ఉంచామని స్పష్టం చేశారు. దుబ్బాక ఉప ఎన్నికలో ఉదయం 11 గంటల వరకు 34.33 శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనుంది. అయితే 5 గంటల వరకు సాధారణ ఓటర్లకు ఓటేసేందుకు అవకాశం కల్పించనున్నారు. 5 నుంచి 6 గంటల వరకు కొవిడ్ బాధితులకు అవకాశం ఇవ్వనున్నారు.

నాలాలో పడి వృద్ధురాలు మృతి

హైదరాబాద్,నవంబర్3(ఆర్ఎన్ఎ): నగరంలోని గడ్డిఅన్నారం డివిజన్‌లో విషాదం చోటు చేసుకుంది. మార్నింగ్ వాకింగ్ వెళ్లిన వృద్ధురాలు ప్రమాదవశాత్తు నాలాలో పడి మృతి చెందిన సంఘటన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శారదానగర్‌కు చెందిన సరోజ అనే వృద్ధురాలు(80) వాకింగ్ కోసం సరూర్‌నగర్ చెరువుకట్ట పైకి వెళ్లింది. నడుస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు నాలాలో పడిపోయింది. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు, డిఆర్ఎఫ్, పోలీసులు జిహెచ్ఎంసి సిబ్బంది అక్కడి చేరుకొని గాలింపు చర్యలు చేపటగా చైతన్యపురిలోని హనుమాన్ నగర్‌లో నాలాలో మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ధరణి పోర్టల్‌లో నాన్ అగ్రికల్చరల్ ఆస్తుల నమోదుపై స్టే

హైదరాబాద్,నవంబర్3(ఆర్ఎన్ఎ): ధరణి పోర్టల్ నాన్ అగ్రికల్చర్ ప్రాపర్టీల వివరాల నమోదుపై హైకోర్టు స్టే విధించింది. ధరణి పోర్టల్‌లో భద్రతాపరమైన అంశాలపై దాఖలైన పిటిషన్లపై నేడు హైకోర్టులో విచారణ జరిగింది. ధరణిలో నాన్ అగ్రికల్చర్ ప్రాపర్టీ వివరాలు నమోదు చేయొద్దని ఆదేశాలు జారీ చేసింది. భద్రతాపరమైన నిబంధనలు పాటించకపోతే ఇబ్బందులు వస్తాయని కోర్టు పేర్కొంది. ప్లేస్టోర్‌లో ధరణి పోర్టల్‌తో పోలిన మరో 4 యాప్స్ ఉన్నాయని హైకోర్టు వెల్లడించింది. అసలు యాప్ ఏదో తెలుసుకోవడం ఇబ్బందన్న హైకోర్టు వ్యాఖ్యానించింది. యాప్ భద్రతపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో తెలపాలని హైకోర్టు సూచించింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

ఇంటర్ విద్యార్థులకు శుభవార్త

పరీక్ష రాయనివారు సైతం పాస్
ఉత్తర్వులు ఇచ్చిన తెలంగాణ సర్కార్

హైదరాబాద్,నవంబర్3(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ పరీక్షలకు హాజరుకాని విద్యార్థులకు శుభవార్త వినిపించింది. ఈ ఏడాది మార్చిలో జరిగిన ఇంటర్ పరీక్షలకు హాజరుకాని 27,589 మంది విద్యార్థులను గ్రేస్ మార్కులతో పాస్ చేయాలని నిర్ణయం తీసుకుంది. వీరిలో మాల్ ప్రాక్టీస్ కమిటీ బహిష్కరించిన 338 మంది విద్యార్థులు కూడా ఉన్నారు. కొవిడ్ నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మార్చిలో జరిగిన ఇంటర్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ పరీక్షలు నిర్వహించకుండా గ్రేస్ మార్కులతో పాస్ చేసిన విషయం తెలిసిందే.

చరిత్రలో నేటినిజం

కం॥ అమలనవధమున నుతుడము
క్రియయుంచుచు సేవలోద ఖ్యాతిని గొంచు
"జమునాలాల బజాజ"ను
విమలాత్ముని గొలుచుచుంటి వేరిమలుగనే

(నవంబర్ 4 జమునాలాల్ బజాజ్ జయంతి..)

-రాధశ్రీ

సెల్: 9494481210



వియన్నా ఉగ్రదాడిపై ప్రధాని మోడీ దిగ్భ్రాంతి

న్యూఢిల్లీ,నవంబర్3(ఆర్ఎన్ఎ): వియన్నా ఉగ్రదాడి ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం తీవ్ర దిగ్భాం÷-రతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. దాడిలో గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆపత్కాలంలో ఆస్ట్రియాకు భారత్ అండగా నిలుస్తుందం టూ ప్రధాని ట్వీట్ చేశారు. సోమవారం ఆస్ట్రియా రాజధాని వియన్నాలో కాల్పుల ఘటన జరిగింది. నగరంలోని ఆరు ప్రాంతాల్లో దుండగులు రైఫిళ్లతో ÷రిరగ్ జరిపారు. ఈ ఘటనలో ముగ్గురు మరణించగా.. 15 మంది వరకు గాయపడ్డారు. ఇది ఉగ్రదాడి అని, ఓ సాయుధుడిని మట్టుబెట్టినట్లు ఆస్ట్రియా ఛాన్సలర్ సెబాస్టియన్ కుర్జ్ తెలిపారు. మరో సాయుధుడి కోసం పోలీసులు అన్వేషిస్తున్నట్లు హోంశాఖ మంత్రి తెలిపారు.

నిజాం నవాబులను తలపిస్తున్న టిఆర్ఎస్ దొరలు

ట్విట్టర్ వేదికగా మండిపడ్డ విజయశాంతి

హైదరాబాద్,నవంబర్3(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఎన్నికల ప్రచారంలో అధికార టీఆర్ఎస్ పార్టీ అహంకారపు ధోరణిలో వ్యవహరించిందంటూ కాంగ్రెస్ నేత విజయశాంతి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దుబ్బాక ఎన్నికల్లో ప్రజలు టీఆర్ఎస్‌కు సరైన బుద్ధి చెబుతారని ఆశిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ మేరకు

సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఆమె..నిజాం నవాబులు తమ విధేయులైన దొరల దన్ను, ఆర్థిక, భూ బలాలు, కిరాయి బలగాలతో ఏ విధమైన అధికారం చెలాయించారో అదే ధోరణిలో నేటి నయా టీఆర్ఎస్ దొరలు ప్రజాస్వామ్యాన్ని తమ అహంకారపు అదుపాజ్ఞలలోని యంత్రాం గంగా వ్యవస్థీకృత చెల్లుబాటు చేసి... తెలంగాణ బిడ్డలపై నడిపించే పక్రియ జరుగుతున్నదనేది వాస్తవం. విజ్ఞులైన మన తెలంగాణ ప్రజలు ఇది గమనించి దుబ్బాక ఎన్నికలలో టీఆరెస్‌కు సరైన బుద్ధి చెబుతారని విశ్వసిస్తున్నాను అంటూ విజయశాంతి పేర్కొన్నారు.

ఎన్నికలు బహిష్కరించిన గ్రామస్తులు

పాట్నా, నవంబర్ 3: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా రెండో విడుత ఎన్నికలకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ముజఫర్‌పూర్ జిల్లా బరురాజ్ అసెంబ్లీ నియోజకవర్గంలోని చౌల్హాయా బిషాన్‌పూర్ గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించారు. తమ గ్రామ అభివృద్ధిని ఎవరూ పట్టించు కోకపోవడంతోనే ఈ ఎన్నికలను బహిష్కరి ంచినట్లు గ్రామస్తులు స్పష్టం చేశారు. ఈ గ్రామంలో మొత్తం 729 ఓట్లు ఉండగా.. ఒక్క ఓటు కూడా నమోదు కాలేదు. పోలింగ్ సిబ్బంది ఖాళీగా కూర్చున్నారు.

17 జిల్లాల పరిధిలోని 94 అసెంబ్లీ సెగ్మెంట్లలో 1,463 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని 2.85 కోట్ల మందికి పైగా ఓటర్లు ఖరారు చేయనున్నారు. ఈ దఫా పోలింగ్‌లో మహాకూటమి సీఎం అభ్యర్థి, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, సీఎం నితీశ్‌కుమార్ క్యాబినెట్‌లోని నలుగురు మంత్రులు, సినీ నటుడు శత్రఘ్నసిన్హా తనయుడు లవ్‌సిన్హా తదితర ప్రముఖులు బరిలో ఉన్నారు. తేజస్వీ తన కుటుంబానికి కంచుకోటగా ఉన్న రాఘోపూర్‌లో, ఆయన సోదరుడు తేజ్‌ప్రతాప్ యాదవ్.. సమస్తిపూర్ నుంచి పోటీలో ఉన్నారు. మొత్తం అభ్యర్థుల్లో 10 శాతం (146) మంది మహిళలు మాత్రమే పోటీలో ఉ న్నారు. కాగా, బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 243 స్థానాలకు వివిధ పార్టీల నుంచి పోటీలో ఉన్న 3,722 మంది అభ్యర్థుల్లో 32 శాతం (1,201) మందికి నేర చరిత్ర ఉందని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రీఫార్మ్స్ సంస్థ తెలిపింది.

ఏవోసీ సెంటర్‌ను సందర్శించిన డీజీవోఎస్

సికింద్రాబాద్, నవంబర్ 3: డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఆర్డినెన్స్ సర్వీసెస్(డీజీవోఎస్), ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్ కల్నల్ కమాండెంట్, లెఫ్టినెంట్ జనరల్ ఆర్‌కేఎస్ కుష్వాహా మంగళవారం ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్(ఏవోసీ) సెంటర్‌ను సందర్శించారు. అనావాయితీ ప్రకారం జనరల్ ఆఫీసర్ హాజరై గార్డ్ ఆఫ్ ఆనర్‌తో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏవోసీ సెంటర్‌లోని వార్ మెమోరియల్‌లో ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్ అమరవీరులకు కుష్వాహా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ఏవోసీ కేంద్రంలోని అన్ని ర్యాంకుల అధికారులు హాజరయ్యారు. సందర్శనలో భాగంగా జనరల్ ఆఫీసర్ నూతనంగా నియామకం అయిన వారి శిక్షణను పరిశీలించారు. డీబీవోఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో సాధారణ సందర్శనలో భాగంగానే ఆర్‌కేఎస్ కుష్వాహా ఏవోసీ సెంటర్‌ను

దళిత ఎమ్మెల్యేపై దాడి దారుణం

దుబ్బాకలో గెలుపు కోసం బరితెగించిన బిజెపి
మండిపడ్డ టిఆర్ఎస్ నేతలు..క్రాంతికి పరామర్శ

హైదరాబాద్,నవంబర్3(ఆర్ఎన్ఎ): దుబ్బాక అసెంబ్లీ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ భారీ మెజారిటీతో గెలవ బోతోందని.. తాము ఓడిపోతున్నామనే నిరాశ, నిస్పృహతో మా దళిత ఎమ్మెల్యే క్రాంతిపై దాడికి పాల్పడడం సిగ్గుచేటు అని టీఆర్ఎస్ నేత, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్రాంతిపై దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు. సీఎం కేసీఆర్ ఆరేళ్లుగా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తీసుకొచ్చారని.. అందుకే గతంలో జరిగిన అన్ని రకాల ఎన్నికల్లో టిఆర్ఎస్ భారీ మెజారిటీతో గెలిచిందని ఆయన గుర్తు చేశారు. కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టును కట్టిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీజేపీ నేతల దగ్గర పోలీసులకు దొరికిన డబ్బును కూడా వారి కార్యకర్తలే ఎత్తుకెళ్లారని ఆయన ఆరోపించారు. తెలంగాణలో మాకు ప్రజలే బాసులు అని ఆయన పేర్కొన్నారు. దుబ్బాకలో డబ్బును విచ్చలవిడిగా వెదజల్లి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ఘటనలకు పాల్పడ్డారని ఆయన ఆరోపిం చారు. కేంద్రం నుండి తెలంగాణకు పెద్దగా సహాయం అందడం లేదు. మిషన్ కాకతీయకు 24 వేల కోట్లు ఇవ్వాలని నీతి ఆయోగ్ చెప్పింది.. పట్టించుకోలేదన్నారు. జీఎస్టీ నిధుల కోసం టీఆర్ఎస్ ఎంపీలం పార్లమెంట్‌లో పోరాడినమని తెలిపారు. దుబ్బాక ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతు న్నాయని ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ పేర్కొన్నారు. దళిత వర్గానికి చెందిన అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, మాజీ ఎమ్మెల్యే వీరేశంలపై బీజేపీ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శిం చారు. మంగళవారం జిల్లాలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన నాయకులు, ప్రజల పట్ల బీజేపీ పార్టీ వ్యవహరిస్తున్న తీరుపై ఆయన ఘాటుగా స్పందించారు. ఇది బీజేపీ పార్టీకి దళిత వర్గాలపై ఉన్న వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాల్సిందిగా డీజీపీ మహేందర్ రెడ్డిని మంత్రి కోరారు. సిద్దిపేటలో బీజేపీ నాయకుల దాడిలో గాయపడ్డ సహచర శాసనసభ్యుడు అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌ను ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ పరామర్శించారు. దాడి జరిగిన తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు. దుబ్బాక ఉప ఎన్నిక పోలింగ్‌కు కొద్దిగంటల సమయముండగా సిద్దిపేటలో ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌పై బీజేపీ కార్యకర్తలు ఒక్కుమ్మడి దాడికి తెగబడ్డారు. ఆయన వెంటే ఉన్న మరో దళిత నేత, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం పైనా విరుచు కుపడ్డారు. అడ్డువచ్చిన పార్టీ కార్యకర్తలపై విచక్షణలేకుండా దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. బీజేపీ నేతల హేయమైన చర్య సర్వత్రా విమర్శలకు దారితీసింది.

బీహార్‌లో మళ్లీ ఎన్డీయేదే విజయం

ప్రజాస్వామ్య పండగలో భారీగా పాల్గొనాలి
భారత ప్రజాస్వామ్యం ప్రపంచానికే ఆదర్శం
బీహార్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ

పాట్నా,నవంబర్3(ఆర్ఎన్ఎ): బీహార్‌లో మళ్లీ ఎన్డీయేను విజయం సాధిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. అరరియా జిల్లాలోని ఫోర్బ్స్‌గంజ్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. బీహారీ ప్రజలు మళ్లీ ఎన్డీయేకే పట్టం కట్టనున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం బీహార్‌లో 94 నియోజకవర్గాల్లో రెండవ దశ పోలింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఇవాళ జరుగుతున్న పోలింగ్‌లో గత ఎన్నికలతో పోలిస్తే ఉదయం 10 గంటల వరకే అత్యధిక పోలింగ్ జరిగిందన్నారు. ఇది కేవలం దేశానికి మాత్రమే కాదు, ఇది ప్రపంచానికి సందేశం అన్నారు. కోవిడ్ వేళ ప్రజలు భారీ సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్నట్లు ఆయన చెప్పారు. ఇది ప్రజాస్వామ్యంలో ఉన్న శక్తి అని, ప్రతి బీహారీ ప్రజాస్వామ్యం పట్ల అంకితభావంతో ఉన్నట్లు మోదీ తెలిపారు. ప్రజాస్వామ్య పండగలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని అన్నారు. భారతీయుల మెదళ్లలో ప్రజాస్వామ్యం ఎలా నాటుకుపోయిందో ప్రపంచవ్యాప్తంగా వేధావులు విశ్లేషించుకునే సందర్భం ఇదని ప్రధాని అన్నారు. కఠినమైన సమయంలో ఎన్నికల సంఘం అదనపు ఏర్పాటు చేసి ఎన్నికలను నిర్వహించడం గొప్ప విషయమని, ఈసీకి కంగ్రాట్స్ చెబుతున్నట్లు మోదీ తెలిపారు. గత దశాబ్ద కాలంలో బీహార్‌లో ప్రతి ఇంటికి విద్యుత్తు, గ్యాస్ కనెక్షన్లు అందాయని, 2021 నుంచి 2030 వరకు మరిన్ని అవసరాలను తీర్చనున్నట్లు ప్రధాని చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు చేశారు. ఆ పార్టీ పట్ల ప్రజలు తీవ్ర నిరాశతో ఉన్నట్లు ఆయన అన్నారు. అవకాశం వచ్చిన ప్పుడల్లా ఆ పార్టీని దేశ ప్రజలు శిక్షిస్తూనే ఉన్నారన్నారు. పార్లమెంట్‌లో కనీసం ఆ పార్టీ ఖాతాలో వంద మంది ఎంపీలు కూడా లేరన్నారు. బీహార్ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న మోదీ మాట్లాడుతూ.. లోక్‌సభ, రాజ్యసభలు కలిపినా.. కాంగ్రెస్ ఎంపీల సంఖ్య వంద దాటదన్నారు. దేశవ్యాప్తంగా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతున్నట్లు ఆయన అన్నారు. ప్రజల్ని ఇంకా మభ్యపెట్టలేరని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఏ స్థితిలో ఉందో అందరికీ తెలుసు అని, ప్రజలే ఆ పార్టీని శిక్షించారన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఇంకా శిక్షిస్తూనే ఉన్నారని, అందుకే అనేక రాష్ట్రాల్లో ఆ పార్టీ నుంచి ఒక్క ఎంపీ కూడా గెలవలేదని ప్రధాని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో స్వార్థం పెరిగిందని, ప్రజల సొమ్మును వాళ్లు దోచుకున్నట్లు ఆరోపించారు. కానీ బీహార్, దేశ ప్రజలు ఇప్పుడు ఆ వాస్తవాలను గమనించారని, అందుకే పదేపదే అబద్ధాలు చెబుతున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఓడించారన్నారు. మాటలు చెప్పి, ప్రజలు అలసిపోయేలా చేశారన్నారు.

అమెరికా అధ్యక్ష ఎన్నికలు : ఇంటర్నెట్ సెర్చ్‌లో ట్రంప్ ముందంజ

వాషింగ్టన్, నవంబర్ 3 : అమెరికా అధ్యక్ష ఎన్నికలు రసవత్తరంగా జరుగుతున్నాయి. అధ్యక్ష ఎన్నికలకు ముందు రేటింగ్‌లో జో బిడెన్ ముందంజలో ఉన్నారు. జో బిడెన్ విజయం తథ్యమని సైబీరియన్ ఎలుగుబంటి కూడా జోస్యం చెప్పింది.

అయితే, ఇంటర్నెట్ సెర్చ్‌లో మాత్రం ప్రస్తుత అధ్యక్షుడు, రిపబ్లికన్ అభ్యర్థి అయిన డొనాల్డ్ ట్రంప్.. తన డెమోక్రాట్ ప్రత్యర్థి జో బిడెన్‌పై స్పష్టమైన ఆధిక్యంలో ఉన్నారు.

ప్రధాన పోలింగ్ సంస్థల నుంచి అందిన అనేక పోల్ నివేదికల ప్రకారం.. డొనాల్డ్ ట్రంప్‌పై బిడెన్ ఎనిమిది పాయింట్ల ఆధిక్యాన్ని కలిగివున్నారు. కానీ గూగుల్ సెర్చ్ డేటా యొక్క విశ్లేషణ పరిశీలిస్తే.. డొనాల్డ్ ట్రంప్ పట్ల ఆసక్తి పెరుగుతున్నదని తెలుస్తున్నది. వాస్తవానికి, అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ఒక రోజు ముందు జో బిడెన్ పట్ల ఆసక్తి తగ్గిపోయింది. సగటున 45 శాతం ఇంటర్నెట్ వినియోగదారులు ట్రంప్ కోసం సెర్చ్ చేయగా

పోలవరంపై కేంద్రం మెలిక ఎందుకు?

నేటినిజం
బుధవారం 4-11-2020

పోలవరం.. ఇప్పుడు ఏపీలో అమరావతి తర్వాత ఇదే బాగా చర్చనీయాంశమైన అంశంగా మారింది. కేంద్రం దీనికి నిధులు ఇవ్వడంలో మెలిక పెట్టడంతో ఇప్పుడు పోలవరం ముందుకు సాగుతుందా లేదా అన్న చర్చ సాగుతోంది. నిర్మాణ వ్యవయాన్ని పెంచారని చెప్పి కేంద్రం పాత లెక్కల మేరకు ఇచ్చి మమ అనిపించుకోవాలని చూస్తోంది. అఖిలపక్షం ఏర్పాటు చేయాలని విపక్ష పార్టీల నేతలు సిఎం జగన్‌ను డిమాండ్ చేశారు. కేంద్రంపై ఒత్తిడి చేస్తే తప్ప ప్రాజెక్టుకు నిధులు విడుదల కాని పరిస్థితి ఏర్పడింది. పోలవరం ఎపికి సంబంధించి జీవనాడి. అది పూర్తయితే తప్ప గోదావరి జలాలను ఉపయోగించుకునే వీలుండదు. సాగు, తాగునీటి సమస్యలు తొలగాలంటే ఇది తప్పనిసరి. అయితే జాతీయ ప్రాజెక్ట్‌గా దీనిని పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్రానిదే. కానీ ప్రాజెక్టును చంద్రబాబు హయాంలో రాష్ట్రం చేపట్టడంతోనే అసలు సమస్య ఏర్పడింది. కేంద్రానికే అప్పగించి పూర్తి చేయించుకుని ఉంటే ఈ పాటికి ప్రాజెక్ట్ పూర్తయ్యేది. అయితే చంద్రబాబు స్వార్థం కారణంగా పనులు నత్తనడకన సాగాయి. అలాగే జగన్ సిఎం అయ్యాక దీనిని సమీక్షించి కేంద్రానికి అప్పగించి ఉంటే సమస్య వచ్చేది కాదు. కానీ జగన్ కంట్రాక్టర్‌ను మార్చి మరో తప్పు చేశారు. జీవనాడి లాంటి ఈ ప్రాజెక్టుకు ఆగిపోయే దాకా వ్యవహారం రావడంతో అందరూ ఆందోళనలో పడ్డారు. అసలు ఈ ప్రాజెక్టు మొదలైంది ఎప్పుడు. ఏ సీఎం హయాంలో ఏం జరిగిందనేది ఇప్పుడు పెద్ద చర్చ జరుగుతోంది. ఇప్పటి పరిస్థితికి టీడీపీనే కారణమని వైసీపీ ఆరోపిస్తోంది. 7 లక్షల ఎకరాలకు పైగా సాగు నీరందిచ్చే ఈ ప్రాజెక్టుకు టి. అంజయ్య కాంగ్రెస్ తరపున ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శంకుస్థాపన చేశారు. ఆ తర్వాతి కాలంలో దీనిపై ఎవరూ పెద్దగా దృష్టిపెట్టలేదన్నది వాస్తవమే. మళ్లీ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞం పేరుతో మొదలు పెట్టిన పనుల్లో భాగంగా ఈ ప్రాజెక్టుకు రూ.600 కోట్లు ఖర్చు పెట్టి కాలువలు తవ్వించారు. ప్రాజెక్టు మొదలుపెట్టకుండా కాలువలు తవ్వించడమంటే కాంట్రాక్టర్ల కోసమేనని అప్పట్లో తీవ్రంగా ఆరోపణలు వచ్చాయి. రూ. 600 కోట్లు కూడా ఏఈబీపీ కింద వచ్చిన కేంద్ర నిధులే. తర్వాత కిరణ్ కుమార్ రెడ్డి పాలనలో పోలవరం కాంట్రాక్టు టెండర్లు ఫైనల్ చేసి ట్రాన్స్ ట్రాయ్ కంపెనీకి పనులు అప్పజెప్పారు. మొబైలేషన్ అడ్వాన్స్ అవి కలిపి రూ.3 వేల కోట్లు ఖర్చు పెట్టారు. కేవలం 10 శాతం పనులు మాత్రమే అప్పటికి అయింది. ఓ రకంగా చెప్పాలంటే గతంలో అధికారంలో ఉన్న సిఎంల ఉదాసీనతల కారణంగా పోలవరం కాంట్రాక్టర్లకు వరంగా మారింది. గత సిఎం చంద్రబాబుకు ఇది ఓ ఎటిఎం కార్డులా మారిందని ప్రధాని మోడీ ఘాటుగానే విమర్శించారు. 2014లో చంద్రబాబు నాయుడు అధికారం లోకి వచ్చిన తర్వాత విభజన తర్వాత రాష్ట్ర పరిస్థితిని మార్చగల కీలక ప్రాజెక్టుగా పోలవరాన్ని గుర్తించినా పూర్తి చేయడంలో మాత్రం తగిన శ్రద్ధ పెట్టలేదు. దీనిని సకాలంలో పూర్తి చేయాలన్న సంకల్పం లేకపోవ డం వల్లనే ఇది నానుతోంది. పైగా విభజన చట్టంలో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా నోటిఫై చేయడంతో నిధుల సమస్య కూడా లేకుండా పోయింది. కానీ పూర్తి కావడానికి నానా రకాల కొర్రీలు పడుతున్నాయి. ఇంతకీ పోలవరం ప్రాజెక్టు విషయంలో కేందప్రభుత్వం ఇప్పుడే ఈ వైఖరి ఎందుకు తీసుకుందన్నది చర్చనీయాం శంగా మారింది. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల మధ్య నెలకొన్న వైరం పుణ్యమా అని కేంద్ర ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకోవాలని చూస్తోంది. ఇతర విషయాలలో మాదిరిగానే అధికార పార్టీ, నెపాన్ని ప్రతిపక్ష పార్టీపై నెట్టి చేతులు దులుపు కోవాలను కుంటోంది. ఇంతకీ పోలవరం ప్రాజెక్టు వ్యయం అమాంతం పెరగడానికి కారణం ఏమిటి? ఎందుకు కేంద్రం నిధులు విడుదల చేయడంలో ఎందుకు అలసత్వం వహిస్తోంది. కేంద్రంతో సఖ్యంగా ఉంటున్నా ఎందుకు ఆలస్యం చేస్తుందన్నదే చర్చ. పోలవరం ప్రాజెక్టు ఎత్తుకు సంబంధించి.. ఆమోదం పొందిన డిజైన్లకు భిన్నంగా చంద్రబాబు ఎత్తు మరింత పెంచాలని నిర్ణయించారు. ఇందుకోసం అదనపు భూమిని సమీకరిం చాల్సి వచ్చింది. ఫలితంగా సహాయ పునరావాస ప్యాకేజీ వ్యయమే 30 వేల కోట్ల రూపాయలకు పెరిగి పోయిందని బాబు వాదనగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని 55 వేల కోట్లకు పెంచుతూ రాష్ట్రప్రభుత్వం పంపిన ప్రతిపాదనను కేంద్రం లోని టెక్నికల్ కమిటీ కూడా ఆమోదించింది. వాస్తవంగా ప్రాజెక్టు నిర్మాణవ్యయం పెద్దగా పెరగలేదు. సహాయ పునరావాస ప్యాకేజీ పెరగడం వల్లనే మొత్తం వ్యయం 55 వేల కోట్లకు చేరిందన్నది టిడిపి నేతల వాదన. పోలవరం ప్రాజెక్టు ఎత్తును పెంచాలన్న ప్రతిపాదనను చంద్రబాబు ప్రభుత్వం చేసి ఉండకపోతే ఇంత వ్యయం అయ్యేది కాదు. భవిష్యత్ అవసరా లను దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు ఎత్తు పెంపు నిర్ణయం తీసుకుని ఉంటారు. అయితే ఈ విషయాన్ని ఆనాడు ప్రభుత్వాధినేతగా గానీ,ఇప్పుడు ప్రతిపక్ష నేతగా గానీ ఆయన బాహాటంగా చెప్పలేరు. అలా చెబితే ఎగువన ఉన్న రాష్ట్రాలు అభ్యంతరం చెబుతాయి. ఫలితంగా ప్రాజెక్టు వివాదాస్పదమవుతుంది. మళ్లీ అనుమతుల పక్రియ మొదటికి వస్తుంది. కేంద్రం నిధులు ఇవ్వకపోతే రాష్ట్రప్రభుత్వం తన సొంత నిధులతో ప్రాజెక్టును పూర్తి చేయలేదా? అని ఆనాడు విపక్షనేతగా జగన్ ప్రశ్నించారు. కమీషన్లకు కక్కుర్తి పడే ప్రాజెక్టు నిర్మాణాన్ని చంద్రబాబు ప్రభుత్వం చేపట్టిందని కూడా విమర్శించారు. చంద్రబాబు అవినీతి కారణంగా ప్రాజెక్టు వ్యయం అమాంతం పెరిగిందని గతంలో ఫిర్యాదు చేసినందున ఇప్పుడు 55వేల కోట్లు ఇవ్వాల్సిం దేనని కేంద్రాన్ని నిలదీయడంలో అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నట్లు సమాచారం.మరోవైపు పోలవరం ప్రాజెక్టులో అవినీతి జరగ లేదని కేందప్రభుత్వమే పార్లమెంట్ సాక్షిగా ప్రకటించింది. పోలవరం ప్రాజెక్టు వ్యయం అమాంతం ఎందుకు పెరిగిందని ప్రశ్నించడం వల్ల రాష్ట్రానికి పరోక్షంగా నిధులను అడ్డుకున్నట్లే అవుతుందన్న విమర్శలు ఇప్పుడు కేంద్రానికి కలసి వచ్చిందా అన్న అనుమానాలు కూడా వస్తున్నాయి. ప్రాజెక్టు అంచనా వ్యయం 55 వేల కోట్ల రూపాయలను మంజూరు చేయాల్సిందేనని కేంద్రాన్ని గట్టిగా నిలదీయాల్సి ఉంది. అవసరమైతే ప్రాజెక్టు నిర్వహణ కేంద్రానికే అప్పగిస్తామని మంత్రి బొత్స చావు కబురు చల్లగా చెప్పారు. సహాయ పునరావాస ప్యాకేజీ ఎవరు భరించాలన్నది తేలకుండా ఈ దశలో కేంద్రానికి అప్పగిస్తే మాత్రం సమస్య పరిష్కారం అవుతుందా? నిర్వాసితుల సమస్యలను తేల్చకుండా ప్రాజెక్టు ఎత్తు తగ్గించి నిర్మించి చేతులు దులుపుకుంటారా? అదే జరిగితే అటు ఉత్తరాంధ్ర, ఇటు రాయలసీమ ప్రజలకు న్యాయం జరుగుతుందా అన్నది ఆలోచన చేయాలి. ఉండవల్లి వ్యాఖ్యానించినట్లుగా ఈ పని అధికారంలోకి రాగానే చేసివుంటే ఫలితతం దక్కేది. అఖిలపక్షం ఏర్పాటు చేసి, నిపుణులతో చర్చించి సమస్యను పరిష్కరించుకుంటే తప్ప పోలవరం ప్రాజెక్ట్ ముందుకు సాగేలా కనిపించడం లేదు.

మైనార్టీ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

-నవంబర్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలి

నిర్మల్,నవంబర్3(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా 2020-21 విద్యా సంవత్సరానికి గానూ మైనార్టీ విద్యార్థులకు విదేశీ విద్యాపథకం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ఇంజినీరింగ్ డిగ్రీలో 60 శాతం మార్కులు ఉండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసేందుకు, పీజీలో 60 శాతం మార్కులు వచ్చి పీహెచ్‌డీ చేయాలనుకునే వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఈ పథ కం ద్వారా లబ్ది పొందే వారు జనవరి నుంచి డిసెంబర్-2020 వరకు ఎంపిక చేసిన విదేశీ యూనివర్సిటీల్లో అడ్మిషన్ పొంది ఉండాలని తెలిపారు. అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, సింగపూర్, న్యూజిలాండ్, సౌత్‌కొరియా దేశాలున్నాయని, ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన, పార్సి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ మార్కుల జాబితా, జీఆర్‌ఈ, జీఎంఏటీ పరీక్ష స్కోర్ కార్డు, టీవోఎఫ్‌ఈఎల్, ఐఎల్‌ఈటీఎస్ పరీక్ష స్కోర్ కార్డు, కుల, నివాస, జనన, రూ.5 లక్షలకు మించకుండా ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. వీటితో పాటు ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ కాపీ, విదేశీ విశ్వవిద్యాలయాల్లో చేరినట్లు ధ్రువీకరణ (1-20), బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ కాపీ, ఫొటో స్కాన్ చేయాల్సి ఉ ంటుంది. అర్హతలున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫారాలను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో డిసెంబర్ 5లోపు సమర్పించాల్సి ఉంటుంది.

కార్యాలయ నిర్మాణాలను పరిశీలించిన మంత్రులు

ములుగు,నవంబర్3(ఆర్ఎన్ఎ): జిల్లాలో నిర్మాణంలో ఉన్న టీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్ రాష్ట్ర మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్ పరిశీలించారు. పార్టీ కార్యాలయ నిర్మాణంలో తగు మార్పులు చేర్పులపై మంత్రి ఎర్రబెల్లి తగు సూచనలు చేశారు. పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలన్నారు. అనంతరం గట్టమ్మ తల్లిని దర్శించుకొని పూజలు చేశారు. వారి వెంట రైతుబంధు సమితి చైర్మెన్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎంపీ మాలోత్ కవిత, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ తదితరులు ఉన్నారు.

విధుల్లో చేరిన సంతోషిణి

యాదాద్రి భువనగిరి,నవంబర్3(ఆర్ఎన్ఎ): భారత్-చైనా సరిహద్దులో వీరమరణం పొందిన కల్నల్ బిక్కుమల్ల సంతోష్ బాబు భార్య సంతోషి యాదాద్రి జిల్లాలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్‌గా విధుల్లో చేరారు. సోమవారం ఆమె కలెక్టర్ అనితారామచంద్రన్‌ను కలిశారు. జూన్ 21న ప్రభుత్వం ఆమెను డిప్యూటీ కలెక్టర్‌గా నియమించిన విషయం విదితమే. ఉద్యోగ విధి విధానాలపై ఇప్పటి వరకు హైదరాబాద్‌లో మూడు నెలల శిక్షణ పొందిన సంతోషికి క్షేత్రస్థాయి శిక్షణ కోసం యాదాద్రి భువనగిరి జిల్లాకు కేటాయించారు. 2021 జనవరి 24 వరకు ఇక్కడ కలెక్టరేట్‌తో పాటు క్షేత్రస్థాయిలో విధులపై శిక్షణ పొందనున్నారు.

రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేసిన సిఎం కెసిఆర్: బండి

హైదరాబాద్,నవంబర్3(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ టీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తున్నారని ఆరోపించారు. మంగళవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో కేంద్రం నిష్పక్షపాతంగా నిధులు ఇస్తుంటే ఒక్క రూపాయి కూడా ఇవ్వడంలేదని టీఆర్ఎస్ నేతలు చెబుతున్నారని, పన్ను కడితేనే కేంద్రం నిధులు ఇస్తుందని చెబుతున్నారని అన్నారు. ఆ పన్నులు కేసీఆర్ జాగీరా? లేక ఆయన ఇంట్లో ముద్ర వేసి పన్నులు కడుతున్నారా? అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు కడుతున్న పన్నులేకదా ప్రభుత్వం కేంద్రానికి కడుతుందని ఆయన అన్నారు.

పత్తి తేమ శాతాన్ని 20కి పెంచాలి : మంత్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 3: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఛైర్మన్‌తో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి సమావేశమై పత్తి కొనుగోళ్లు, నిల్వలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. పత్తి కొనుగోళ్లలో తేమ శాతాన్ని పెంచాలన్నారు. సీసీఐ నిబంధనలు వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో పత్తి చేలు నీటిలో మునిగిపోయాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత సీసీఐ నిబంధనల ప్రకారం రైతులు భారీగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. 12 శాతం తేమ నిబంధనను 20 శాతానికి సవరించి కొనుగోలు చేయాలని కోరారు. 2019-20 ఏడాదికి 49.56 లక్షల పత్తి బేళ్లను కాటన్ కార్పొరేషన్ నిల్వ చేయగా, అందులో 9.28 లక్షల బేళ్లను మాత్రమే తరలించడం జరిగిందని తెలిపారు. పాత నిల్వలను వెంటనే తరలించి, కొత్తగా కొనుగోలు చేసిన పత్తి నిల్వ చేయాలని మంత్రి నిరంజన్ రెడ్డి కోరారు.

మిర్చి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు చర్యలు

చపాట మిర్చి సాగుకు రైతుల ఆసక్తి
ఎగుమతులకు భారీగా డిమాండ్

వరంగల్,నవంబర్3(ఆర్ఎన్ఎ): నర్సంపేటలో మిర్చి పరిశోధన కేంద్రం ఏర్పాటుచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. నర్సంపేట, నల్లబెల్లి మండలాల్లోనే పెద్ద మొత్తంలో సాగవుతు న్నందున వరంగల్ రూరల్ జిల్లాలోనే రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుచేయాలని యోచిస్తోంది. ఇందుకుగాను అనుకూలమైన ప్రభుత్వ భూములు ఎక్కడ ఎక్కువగా ఉ న్నాయని గతేడాది ఉద్యానవన శాఖ అధికారులు పరిశీలించారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ ఎం.హరిత రెండుసార్లు ఈ స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్మించే రీసెర్చ్ సెంటర్‌ను నర్సంపేటలోనే నెలకొల్పేలా ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే సైతం పలుమార్లు స్థల పరిశీలన చేసి ఉ న్నతాధికారులకు సూచనలు చేశారు. పరిశోధన కేంద్రం ఏర్పాటైతే ఈ ప్రాంత రైతులకు మరింత మేలు జరుగనుంది. జిల్లాలోని చాలా గ్రామాల్లో మిర్చి సాగు జోరందుకుంది. ఈ వానకాలం సీజన్‌లో చెరువులు, కుంటల్లో పుష్కలంగా నీరుచేరడంతో నర్సంపేట, పరకాల, వర్ధన్నపేట డివిజన్‌వ్యాప్తంగా నారు విత్తే పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 5,250 హెక్టార్లు కాగా గతేడాది 6,453 హెక్టార్లలో పంట వేశారు. కేవలం నర్సంపేట డివిజన్‌లోనే గతేడాది అత్యధికంగా 2800 హెక్టార్లలో సాగుకాగా ఈసారి మరింత పెరిగే అవకాశముందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. చపాట మిర్చికి నర్సంపేట డివిజన్ కేరాఫ్‌గా మారింది. ఇక్కడ పండించే పంటకు మొదటినుంచి ప్రపంచస్థాయి గుర్తింపు ఉ ంది. వరంగల్ రూరల్ జిల్లాలో గతేడాది 6453 హెక్టార్లలో సాగుకాగా ఈసారి పెరిగే అవకాశముంది. చపాటా మిర్చిని మహారాష్ట్ర, ముంబై, నాగ్‌పూర్, అహ్మదాబాద్, జలగాం తదితర ప్రాంతాల్లో విక్రయిస్తుంటారు. అంతేగాక ఈ మిర్చికి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి గిట్టుబాటు ధర పలుకుతుంది. ఫలితంగా ఎంతోమంది రైతులు ఆర్థికంగా ఎదిగినవారూ ఉన్నారు. ఇక్కడి నేలలు, వాతావరణం అనుకూలంగా ఉండడంలో ఆశించిన దిగుబడి వస్తుండడంతో ఎక్కువ మంది రైతులు గంపెడాశతో మిర్చి సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు మిర్చిని రెండో పంటగా వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ దేశవాళీ పంటను సాగుచేయడంలో ఇక్కడి రైతులు ఆరితేరారు. చాలా ఏళ్లుగా ఈ ప్రాంతంలో పండించిన మిర్చిని మహారాష్ట్ర, అహ్మదాబాద్, తదితర రాష్ట్రాలకే గాక వివిధ దేశాలకూ విక్రయిస్తుంటారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ పంటకు మంచి గిట్టుబాటు ధర దక్కుతుండడంతో ఎక్కువ మంది రైతులు చపాటా వైపే మొగ్గుచూపుతున్నారు. ఇక్కడి నేలలు, వాతావరణం అనుకూలంగా ఉ ండడంతో దిగుబడి ఎక్కువ తీస్తూ రైతులు ఆర్థికంగా ఎదుగుతున్నారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం డివిజన్‌లో మిర్చి రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోంది. తొలుత తొలకరి వానలు మొదలయ్యే జూన్ నెలలో వేరుశనగ, మక్కజొన్న వేస్తారు. ఆ పంటలు చేతికొచ్చిన తర్వాత మార్కెట్‌కు తరలించి విక్రయించడం ద్వారా మరో పంటకు అవసరమయ్యే పెట్టుబడికి వినియోగిస్తారు. ఇందుకోసం నెల రోజుల ముందునుంచే మిరుప నారు సిద్ధంచేసుకొని ఏపుగా పెరిగిన తర్వాత భూముల్లో విత్తేందుకు సిద్ధమయ్యారు. ఇలా కొన్నేళ్ల నుంచి మిర్చి వేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. నర్సంపేట మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఉత్సాహంగా మిర్చి వేశారు.

17 వేల ఎకరాల్లో మక్కజొన్న పంట

సాగు విస్తీర్ణంపై అధికారుల లెక్కలు

భద్రాద్రి కొత్తగూడెం,నవంబర్3 (ఆర్ఎన్ఎ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా 17 వేల ఎకరాల్లో మక్కజొన్న పంట సాగైనట్లు వ్యవసాయశాఖ అధికారుల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుత వానకాలంలో అధిక వర్షాల ప్రభావం మక్కజొన్న దిగుబడిపై గణనీయంగా చూపింది. ప్రస్తుతం మక్కజొన్న పంట చేతికందడంతో రైతులు నష్టపోకూడదన్న సదుద్దేశంతో ప్రభుత్వం మద్దతు ధరకు మక్కజొన్న కొనుగోలుకు సన్నద్ధమైంది. దీనికోసం మార్కెఫెడ్ ద్వారా సాగు విస్తీర్ణం అధికంగా నమోదైన ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పనిలో మార్క్‌ఫెడ్ అధికారులు నిమగ్నమయ్యారు. గతం మాదిరిగా కాకుండా ఈసారి మక్కజొన్న కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టేందుకు ప్రభుత్వం వ్యూహాన్ని సిద్ధం చేసింది. గ్రామాల వారీగా మక్కజొన్న సాగు వివరాలు, దిగుబడి, విక్రయాలు వంటి అంశాలను పరిశీలించేందుకు వ్యవస్థాయి శాఖ అధ్వర్యంలో క్షేత్రస్థాయి పర్యటన చేసేలా ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. మక్కజొన్న సాగు విస్తీర్ణం అంతగా లేని మండలాలకు చెందిన ఏఈవోలను సాగు విస్తీర్ణం అధికంగా నమోదైన మండలాల్లో పర్యటించాలని ఆదేశాలు జారీ చేశారు. వీరంతా వారం రోజులుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సాగు విస్తీర్ణంపై పకడ్బందీగా లెక్కలు వేస్తున్నారు. రైతుల వద్ద నిల్వ ఉన్న మక్కల చిత్రాలు తీస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చేసిన సర్వే ఆధారంగా మక్కజొన్న పంటను సాగు చేసిన రైతుల వివరాలను ఇప్పటికే నమోదు చేసుకున్నారు. ఇతర ప్రాంతాల్లో మక్కజొన్న పండించిన వారు, రైతుల నుంచి కొన్నవారు మద్దతు ధర కోసం కొనుగోలు కేంద్రాల వద్దకు నేరుగా వచ్చి అక్రమాలు చేయకుండా ఈ దఫా ప్రభుత్వం టోకెన్ల విధానాన్ని అమల్లోకి తెచ్చింది. వ్యవసాయశాఖ వద్ద మక్కజొన్న సాగు చేసిన రైతుల వివరాలు ఇప్పటికే నమోదై ఉన్నందున సంబంధిత రైతులకు మాత్రమే టోకెన్లు అందజేయనున్నారు. ఇందులోనూ రైతుల సమగ్ర సమాచారం పోర్టల్‌లో నమోదైన రైతులకు మాత్రమే టోకెన్లు పంపిణీ చేయనున్నారు. నమోదు కాని వారి నుంచి కొనుగోళ్లు చేయవద్దని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. దీనికోసం మక్కజొన్న విక్రయించే ప్రతి రైతూ వ్యవసాయశాఖ అధికారుల నుంచి ముందుస్తుగా టోకెన్లు తీసుకున్న తరువాతే తమ పంటను కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. మక్కజొన్న సాగు విస్తీర్ణం ఆధారంగా కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఈ దఫా 12 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అన్ని చోట్ల కొనుగోలు బాధ్యతను పీఏసీఎస్‌లకు అప్పగించారు. మక్కజొన్న కొనుగోళ్ల పక్రియ ఈ దఫా ఆన్‌లైన్‌లో చేపట్టనున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల సిబ్బందికి ఆన్‌లైన్‌లో కొనుగోలు పక్రియపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఆన్‌లైన్‌లో పొందు పర్చాల్సిన అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు. కొనుగోలు సమయంలో రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో విధిగా పొందుపర్చాల్సి ఉంటుంది. ఇంతేకాకుండా రైతులకు ఇవ్వాల్సిన డబ్బులను కూడా రైతుకు సంబంధించి రైతుబంధు అకౌంట్‌లో జమచేయనున్నారు. ఈ దఫా రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలతో వచ్చి తమ పంటను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

డబుల్ బెడ్ రూం ఇండ్లను ప్రారంభించిన మంత్రి పువ్వాడ

ఖమ్మం,నవంబర్3(ఆర్ఎన్ఎ): రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామంలో రూ.1.51 కోట్లతో నూతనంగా నిర్మించిన 30 డబుల్ బెడ్ రూంఇండ్లను రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికి ఇండ్లను అందించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉ ందన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. నిరుపేదలకు అవసరమైన నివాసానికి అవసరమైన ఇండ్లు నిర్మించి ఇచ్చేందుకు అన్ని చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. ఇదిలావుంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ పక్రియ రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా ప్రారంభమయ్యాయన రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. జిల్లాలోని రఘునాథ పాలెం తహసిల్దార్ కార్యాలయంలో ధరణి సేవల పక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధరణి ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుతో మాట్లాడారు. ఆయా పత్రాలను వారికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ధరణి పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ల కు మంచి స్పందన లభిస్తోందన్నారు. రిజిస్ట్రేషన్ల స్లాట్ బుకింగ్‌ను మీ సేవా కేంద్రాల ద్వారా కేవలం రూ. 200 చెల్లించి చేసుకోవచ్చని, స్మార్ట్ ఫోన్ ద్వారా కూడా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. పాత రిజిస్ట్రేషన్లు , పాత మ్యుటేషన్లు, వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల పై త్వరలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్, అదనపు కలెక్టర్ మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ అనురాగ్ జయంతి అధికారులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు రావద్దు

ఆదిలాబాద్,నవంబర్3(ఆర్ఎన్ఎ): ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎమ్మెల్యే జోగు రామన్న పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలు, గన్ని సంచుల నిర్వహణపై తేడాలు రావద్దన్నారు. వానాకాలం సాగులో పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తాయని, ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా చూడాలని సూచించారు. కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, గన్నీ సంచుల కొర త లేకుండా చూస్తామని, ఈసారి సన్నరకం వడ్లు కొనుగోలు చేస్తామన్నారు.

26న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

ఆదిలాబాద్,నవంబర్3(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నవంబరు 26న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను ప్రోత్సహిస్తోందన్నారు. ప్రైవేటు కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ రంగ సంస్థలను ధారాదత్తం చేస్తుందన్నారు.బొగ్గుబ్లాక్‌లను, రైల్వ

నాలాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

యధాతథంగా ఆక్రమణల తొలగింపు : కెటిఆర్

హైదరాబాద్,నవంబర్2(ఆర్ఎన్ఎ): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో నాలాల అభివృద్ధికి ప్రత్యేక వ్యూహాత్మక కార్యక్రమం తీసుకురాబోతున్నామని ఐటీ, పురపాలిక శాఖల మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నగరంలో భారీ వరదలు వచ్చినా ముంపును అరికట్టేలా నాలాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. నాలాల వ్యూహాత్మక అభివృద్ధికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రత్యేక విభాగం నాలాలు, డ్రైనేజీలను అధ్యయనం చేసి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వీటిని అభివృద్ధి చేయనున్నారు. పురపాలక. వైద్య ఆరోగ్య, సాగునీటిశాఖల అధికారులు పనులను పర్యవేక్షిస్తారు. నాలాలపై ఆక్రమణల తొలగింపు బాధ్యతలను కూడా ప్రత్యేక విభాగానికే అప్పగిస్తున్నట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. నగరంలోని చాలా నాలాలు ఆక్రమణకు గురవడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు కాలనీలు నీటమునిగిన విషయం తెలిసిందే. దీంతో భవిష్యత్‌లో ఇలాంటి ఉపద్రవం పునరావృతం కాకుండా తెలంగాణ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నాలాలపై అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చేసిన విషయం తెలిసింది.

ప్రయాంక రాధాకృష్ణన్‌కు కెటిఆర్ అభినందన

న్యూజిలాండ్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ప్రియాంక రాధాకృష్ణన్‌కు రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. న్యూజిలాండ్‌లో మంత్రి స్థాయికి ఎదిగిన మొట్టమొదటి భారతీయురాలు ప్రియాంక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో భారీ విజయం సాధించిన న్యూజిలాండ్ ప్రధాని జసిందా అండర్న్ కు కూడా కేటీఆర్ అభినందనలు తెలిపారు. న్యూజిలాండ్ ప్రధాన మంత్రి జసిందా సోమవారం కొత్త మంత్రివర్గాన్ని ఆవిష్కరించారు. తాజాగా ఆ దేశ కేబినెట్‌లో ప్రియాంక చోటు దక్కించుకున్నారు. ప్రియాంక రాధాకృష్ణన్ స్వస్థలం కేరళలోని ఎర్నాకుళం జిల్లా పరవూర్. రామన్ రాధాకృష్ణన్, ఉషా దంపతులకు ఆమె జన్మించారు. అనంతరం ఆ కుటుంబం చెన్నైలో స్థిరపడింది. ప్రియాంకా విద్యాభ్యాసం సింగపూర్, న్యూజిలాండ్‌లో కొనసాగింది. ఆ తర్వాత ఆమె... క్రైస్ట్‌చర్చ్‌కు చెందిన రిచర్డ్‌సన్‌ను వివాహమాడింది. 2004 నుండి లేబర్ పార్టీలో చురుకైన పాత్రను పోషించారు. 2017లో తొలిసారిగా న్యూజిలాండ్ పార్లమెంటులో ప్రవేశించిన ప్రియాంక, వారసత్వ శాఖకు పార్లమెంటరీ ప్రైవేట్ కార్యదర్శిగా పనిచేశారు. న్యూజిలాండ్ ప్రధాన మంత్రిగా జసిందా రెండోసారి ఎన్నికయ్యారు. 83.7? కంటే ఎక్కువ ఓట్లు లెక్కించగా, ఆ÷-డ్గ÷ర్న్ యొక్క లేబర్ పార్టీ 49శాతం ఓట్లను గెలుచుకున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది.

శ్రీనివాసరెడ్డిపై అసత్య ప్రచారాలు

పార్టీ మారుతున్నారంటూ ఫేక్ న్యూస్ బాధ్యులపై తక్షణం చర్యలు తీసుకోండి డిజిపికి కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

హైదరాబాద్,నవంబర్3(ఆర్ఎన్ఎ): డీజీపీ మహేందర్ రెడ్డిని కాంగ్రెస్ నేతల బృందం కలిసింది. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్, కాంగ్రెస్ పార్టీ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి మీద తప్పుడు ప్రచారం చేసిన వారిపై ఫిర్యాదు చేశామని తెలిపారు. పోలింగ్ ముగిసేలోపు వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటమి భయంతో టీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కయ్యా యని విమర్శించారు. హరీశ్‌రావు, రఘునందన రావు కలసి కాంగ్రెస్‌పై కుట్ర చేశారని ఆరోపించారు. ఎన్నికల ప్రధాన అధికారిని కూడా కలిసి ఫిర్యాదు చేస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దుబ్బాక ఎన్నికలలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్ రెడ్డి పార్టీ మారుతున్నట్లు తప్పుడు వార్తలు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు డీజీపీ మహేందర్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై ఫిర్యాదు చేయడానికి కాంగ్రెస్ నేతలు మంగళవారం డీజీపీ కార్యాలయానికి చేరుకున్నారు. టీపీసీసీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, పలువురు కాంగ్రెస్ నేతలు డీజీపీకి ఫిర్యాదు చేశారు. అనంతరం టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, దుబ్బాకలో పోలింగ్ మొదలు కాగానే సోషల్ మీడియాలో టీఆర్ఎస్ ,బీజేపీలు దుష్ప్రచారం మొదలు పెట్టాయి. కాంగ్రెస్ అభ్యర్థి టీఆర్ఎస్‌లో చేరినట్లు ప్రముఖ టీవీ ఛానెల్‌లో బ్రేకింగ్ నడిచినట్లు ఒక వీడియో సృష్టించి సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. దీనిపై స్పందించిన ఆ టీవీ ఛానెల్ కూడా మేము ప్రసారం చేయలేదని చెప్పింది. ఓటమి భయంతో హరీష్ రావు, రఘునందన్ చేసిన కుట్రే ఇది. ఈ కుట్రపై డీజీపీ కి ఫిర్యాదు చేశాం. కేరళలో ఇదేవిధంగా దుష్ప్రచారం చేస్తే ఎన్నికల కమిషన్ గెలిచిన అభ్యర్థిని డిస్ క్వాలిఫై చేసింది. కేరళ హైకోర్టు జడ్జి ఇచ్చిన తీర్పును ఎన్నికల కమిషనర్ దృష్టికి తీసుకువెళ్తాం' అని అన్నారు. మరో కాంగ్రెస్ నాయకుడు, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. 'దుబ్బాక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తుందనే సంకేతాలు రావడంతోనే టీఆర్ఎస్, బీజేపీలు సరికొత్త కుట్రకు తెరతీశాయి. కాంగ్రెస్ అభ్యర్థి చెరకు శ్రీనివాసరెడ్డి టీఆర్ఎస్‌లో చేరుతున్నాడని తమకు అనుకూలమైన మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నాయి. అసలు ఈ ప్రచారంలో ఏ మాత్రం వాస్తవం లేదు. దీనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. ఉన్నది లేన్నట్టు.. లేనిది ఉన్నట్టు గోబెల్స్ ప్రచారం చేయడంలో టీఆర్ఎస్, బీజేపీలు దిట్ట. ఈ ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దు. ప్రజల గొంతు వినిపించాల్సిన ఛానల్స్ కొన్ని పార్టీలే నడిపించడం వల్లే ఈ అవాస్తవాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. ఇలాంటి ఛానల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి' అని కోరారు.

దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాసరెడ్డి పార్టీ మారుతాడంటూ దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్య తీసుకోవాలని డిజిపికి ఫిర్యాదు చేసి వస్తున కాంగ్రెస్ నేతలు ఉత్తమ్ కుమార్ రెడ్డి, అంజన్ కుమార్ యాదవ్ తదితరులు

సీఎం సహాయనిధి పేదలకు వరం

ఘట్‌కేసర్, నవంబర్ 3: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన మదిపడిగె బాలమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును మంత్రి మల్లారెడ్డి సోమవారం అందజేశారు. బాలమ్మ అనారోగ్యానికి గురై దవాఖానలో చికిత్స తీసుకుంది. అనంతరం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు బాధితురాలికి మంజూరైన చెక్కును మంత్రి మల్లారెడ్డి మున్సిపల్ వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి సమక్షంలో అందజేశారు. మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ

శామీర్‌పేట : ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ హారికామురళీగౌడ్ అన్నారు. సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.55వేల చెక్కును కొల్తూర్ గ్రామానికి చెందిన కే.సాయికుమార్‌కు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి..

ఘట్‌కేసర్ : పోచారం మున్సిపాలిటీలోని నారపల్లి నుంచి వచ్చే డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని సాయినగర్ కాలనీ వాసులు మంత్రి మల్లారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, జనరల్ సెక్రటరీ మహేశ్వరి రెడ్డి, సభ్యుడు ఆర్.ప్రమోద్‌రెడ్డి సోమవారం మంత్రి నివాసంలో కలిసి వినతిపత్రం అంజేశారు. కొన్ని రోజులుగా నారపల్లిలోని వివిధ కాలనీల నుంచి వచ్చే డ్రైనేజీ నీరు పూర్తిగా తమ కాలనీ మధ్యలో నుంచి వెళ్తుందని, ఇటీవల కురిసిన భారీ వరదనీరు ఇండ్లలోకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. మొదటి నుంచి ఈ డ్రైనేజీ నీరు కాలువలా ప్రవహిస్తుందని ఈ ప్రాంతంలో ఇండ్ల నిర్మాణానికి ఈ డ్రైనేజీ నీరు సమస్యగా మారిందని కాలనీ వాసులు మంత్రికి వివరించారు. శాశ్వత పరిష్కారంగా పెద్ద పైప్‌లను ఏర్పాటు చేసి డ్రైనేజీ నీటిని కాలనీ దాటే విధంగా మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే స్పందించిన మంత్రి మల్లారెడ్డి పోచారం మున్సిపాలిటీ కమిషనర్, చైర్మన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. నారపల్లి నుంచి వచ్చే డ్రైనేజీ నీరు కాలువలా కాకుండా, పైపుల ద్వారా కిందకు పంపే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

వరదప్రాంత రైతులను ఆదుకుంటాం

వ్యవసాయ కాల్వల పునరుద్ధరణకు ప్రాధాన్యం అధికారులకు మంత్రి కన్నబాబు ఆదేశం

కాకినాడ,నవంబర్3(ఆర్ఎన్ఎ): వరదల కారణంగా నష్టపోయిన రైతులందరిని ఆదుకుంటమాని వ్యవసాయ శాఖ మంత్రి కన్నబాబు మరోమారు స్పష్టం చేశారు. అలాగే దెబ్బతిన్న కాలువులను పునరుద్ధరిస్తామని అన్నారు.

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా ఏలేరు పంట కాలువలు, డ్రెయిన్లకు ఏర్పడిన గండ్లను సత్వరమే పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను మంత్రి కురసాల కన్నబాబు ఆదేశించారు. ఇరిగేషన్ శాఖ హెడ్ వర్క్స్, ఏలేరు డివిజన్, డ్రెయిన్స్ డివిజన్ ఇంజనీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పనుల ప్రగతిపై సమీక్ష చేపట్టారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏలేరు వ్యవస్థలో వరదల కారణంగా దెబ్బతిన్న కాల్వలు, డ్రెయిన్ల పునరుద్ధరణ కోసం తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. శాశ్వత ప్రాతిపదికన వరద నివారణ పనులకు ఫేజ్-2 ఆధునికీకరణ కింద అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందివ్వాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. నవర ఏరుకు చెందిన ఆధునికీకరణ పనులకు లైన్ ఎస్టిమేట్లు వెంటనే తయారు చేయాలన్నారు. మురుగు వ్యవస్థకు చెందిన అవుట్ పాల్ స్లూయిజ్‌ల రిపేర్లు, డ్రెయిన్లకు ఏర్పడిన గండ్లు పూడ్చడానికి అంచనాలు రూపొందించి అత్యవసరంగా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

పోలవరంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

-పోలీసుల అత్యుత్సాహంపైనా విచారణ చేయాలి: దేవినేని

అమరావతి,నవంబర్3(ఆర్ఎన్ఎ): రాజధానిని గందరగోళంలో పడేసిన వ్యక్తి, ఇప్పుడు పోలవరాన్ని కూడా మూలకు నెడితే ప్రజలు ఎంతోకాలం మౌనంగా ఉంటారని టిడిపి నేత దేవినేని ఉమ ప్రశ్నించారు. చట్టంలో స్పష్టంగా పేర్కొన్న పోలవరాన్ని కూడా సాధించుకోలేకపోవడం సిఎం జగన్ అసమర్థత అన్నారు. చంద్రబాబు సిఎంగా ఉన్న సమయంలో 70శాతం పనులు పూర్తయ్యాయని అన్నారు. కనీసం అందరితో చర్చించి సమస్యను ఎలా ముందుకు తీసుకుని వెళ్లాలన్న ఆలోచన కూడా ప్రభుత్వానికి లేదన్నారు.

రాజధానిగా అమరావతినే కొనసాగించాలని ఆందోళన చేస్తున్న రైతులను అరెస్ట్ చేసి చేతులకు సంకెళ్లు వేసిన వారికి పోలవరంపై చర్చించాలన్న ఆలోచన ఎలా వస్తుందని దేవినేని విమర్శించారు. న్యాయమైన డిమాండ్ల కోసం ఉద్యమించే రైతుల చేతులకు బేడీలు వేయకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసినా, ఏపీ పోలీసులు ఈ క్రూరత్వానికి పాల్పడ్డారు. రైతులకు సంకెళ్లు వేయడంపై హోంమంత్రి సుచరిత కూడా పోలీసుల అత్యుత్సాహం అని వ్యాఖ్యానించడం గమనించాలన్నారు. దళిత రైతులపై కూడా ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు పెట్టడం దారుణం కాకపోతే మరేంటని అన్నారు. ఈ అరెస్టులు, సంకెళ్లకు కారణమైన ఫిర్యాదు చేసిన వ్యక్తి, తన ఫిర్యాదును ఉపసంహరించుకుంటానని స్పష్టంచేసినా స్థానిక డీఎస్పీ అంగీకరించకపోవడం అనుమానాలకు తావిస్తోందిన అన్నారు. పోలీస్ శాఖ మాత్రం ప్రభుత్వాధినేత సేవలో తరించిపోతోందని మండిపడ్డారు. ప్రభువులను సంతృప్తి పరచడానికై అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తోంది. కొంతమంది నీతిమాలిన అధికారుల చర్యల వల్ల మొత్తం పోలీస్ శాఖకే తలవంపులు వస్తున్నాయన్నారు. పోలీస్ శాఖ ఉన్నది ప్రజల కోసమే గానీ, అధికార పార్టీ కోసం కాదన్నారు. పోలవరంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని దేవినేని అన్నారు.

కామన్ పిజి ఎంట్రెన్స్ పరీక్ష వాయిదా

హైదరాబాద్,నవంబర్3(ఆర్ఎన్ఎ): ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన, జేఎన్టీయూ వర్సిటీల్లో పీజీ (ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్ తదితర), పీజీ డిప్లొమా, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించనున్న కామన్ పీజీ ప్రవేశ పరీక్ష (సీపీజీఈటీ-2020) వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 6 నుంచి పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా యూనివర్సిటీ వర్గాలు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నాయి. డిసెంబర్ 1 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ మేరకు దరఖాస్తు గడువును సైతం మరోమారు పొడిగించారు. ఆలస్య రుసుముతో ఈ నెల 21 వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఓయూ యూనివర్సిటీ కన్వీనర్ సూచించారు. కామన్ పీజీ ప్రవేశ్ పరీక్షను గతేడాది మాదిరి ఈ సారి కూడా ఉస్మానియా యూనివర్సిటీయే నిర్వహిస్తున్నది. ఇటీవల నగరంలో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ఓయూ పరిధిలో జరగాల్సిన డిగ్రీ పరీక్షలు వాయిదా పడ్డాయి. వాయిదా పడిన పరీక్షలను ఈ నెల 6 నుంచి నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ వర్గాలు వెల్లడించాయి. అదేవిధంగా ఈ నెల 10 నుంచి ఎంబీఏ సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

పేదల ఆపద్బాంధవుడు కొండ దేవయ్యకు జెజెఎస్ సన్మానం...

రాజన్న సిరిసిల్లా, నవంబర్ 3 (నేటినిజం ప్రతినిధి):జననీ జన్మభూమి స్టూడెంట్స్ సూసైడ్స్ అండ్ క్రిమ్స్ ఎరాడికేషన్ సొసైటీ (జెజెఎస్)రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పేదల పెన్నిది,అనాథలకు ఆపద్బాంధవుడు మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య ను వేములవాడ లోని తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి సుంకాపాక దామోదర్ రాజన్న సిరిసిల్ల జిల్లా కన్వీనర్ వీరగోని చైతన్య గౌడ్ మాట్లాడుతూ

నిత్యం సామాజిక సేవాకార్యక్రమాలు చేస్తూ పేదలకు, అనాథలకు తక్షణ సహాయం చేసే కొండ దేవయ్య ప్రజలకు ఆపద్బాంధవుడని అన్నారు. అదేవిధంగా సమాజ శ్రేయస్సు కోసం కృషి చేసే మానవతావాది అన్నారు.ఈ సందర్భంగా కొండ దేవయ్య మాట్లాడుతూ ఆత్మహత్య లు నేరాల నివారణకై జిల్లాలో మరియు రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన సదస్సులు, కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉద్యమిస్తున్న జెజెఎస్ సభ్యులను అభినందించారు.రానున్న జెజెఎస్ కార్యక్రమాలకు తమవంతు సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెజెఎస్ రాష్ట్ర కమిటీ సలహాదారు ఎం.ఏ మన్నాన్. సభ్యులు .....తలారి సురేష్,సింగారపు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలం

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి

రాజన్న సిరిసిల్లా, నవంబర్ 3 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణం విలీన గ్రామం తిప్పాపురంలో మంగళవారం వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేయడం జరిగింది ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి మాట్లాడుతూ రైతులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నారని ఆయన అన్నారు రైతులు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించకపోవడం లో పూర్తిగా విఫలమైందని ఆయన అన్నారు కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ బిల్లు తెచ్చిన సందర్భంలో వెంటనే వ్యవసాయ వ్యతిరేక బిల్లును ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు టిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు సన్నరకం పంట వేయమని చెప్పిన కేసీఆర్ ఇప్పుడు రైతులు పూర్తిగా నష్టపోయారు వారికి వెంటనే ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు తడిసిన ధాన్యం య0.ఎస్ .పి. ధరలు అమలు చేయాలని ఈరోజు గౌరవ రాష్ట్రపతికి గౌరవ గవర్నర్ కు ప్రభుత్వాల వ్యతిరేకంగా సంతకాల సేకరణ ద్వారా వాళ్లకి పంపడం జరుగుతుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శి పాత సత్య లక్ష్మి చిలుక రమేష్ కూరగాయల కొమురయ్య, మోడిగె చంద్రశేఖర్,, నాగుల రాము గౌడ్, కనికరపు రాకేష్ హైమద్ పాషా ,వనపర్తి శంకర్ , మస్తాన్ ,అడగట్ల వనిత ,ఇంద్ర తదితరులు ఉన్నారు

యూపిలో రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవం

పోటీ లేకపోవడంతో పదిమంది ఎన్నిక

ఇక అధికారికంగా ప్రకటించడమే తరువాయి

లక్నో,నవంబర్3(ఆర్ఎన్ఎ): రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్ నుంచి మొత్తం 10 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో బరిలో నిలిచిన 10 మంది సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరి ఎన్నికను అధికారికంగా ప్రకటించాల్సి ఉన్నది. రిటర్నింగ్ అధికారి కుట్రకు తాను బలయ్యానని, తనకు న్యాయం జరిగేంత వరకు ఫలితాలను నిలుపుదల చేయాలని స్వతంత్ర అభ్యర్థి ప్రకాశ్ బజాజ్.. ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు అనూహ్య మలుపు తిరిగాయి. సమాజ్ వాదీ పార్టీ మద్దతుతో బరిలో నిలిచిన వారణాసికి చెందిన న్యాయవాది ప్రకాశ్ బజాజ్ నామినేషన్‌ను అధికారులు సాంకేతిక కారణాలతో పక్కనపెట్టడంతో.. 10 స్థానాలకు ఎన్నికలు జరుపాల్సిన అవసరం లేకుండా పోయింది. దాంతో 10 స్థానాల్లో బీజేపీకి ఎనిమిది, సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీకి చెరొక్కటి లభించాయి. ఎన్నికైన బీజేపీ అభ్యర్థులలో కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పూరితోపాటు అరుణ్ సింగ్, హరిద్వార్ దుబే, బ్రిజ్ లాల్, నీరజ్ శేఖర్, గీతా శాక్య, సీమా ద్వివేది, బీఎల్ వర్మ ఉన్నారు. సమాజ్‌వాదీ పార్టీ నుంచి ప్రొఫెసర్ రామ్ గోపాల్ యాదవ్, బీఎస్పీ నుంచి రామ్‌జీ గౌతమ్ కూడా ఎగువ సభకు ఎన్నికయ్యారు. బీఎస్పీకి చెందిన రాంజీ గౌతమ్, ఎస్పీ మద్దతుతో బరిలో నిలిచిన స్వతంత్ర అభ్యర్థి ప్రకాష్ బజాజ్ మధ్య పదో సీటు కోసం హై డ్రామా జరిగింది. చివరకు ప్రకాశ్ బజాజ్ నామినేషన్‌ను సాంకేతిక పరిశీలనలో రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు. దాంతో బీఎస్పి అభ్యర్థి రామ్‌జీ గౌతమ్.. తన పార్టీకి పది ఓట్లు మాత్రమే ఉన్నప్పటికీ విజయం సాధించారు. తన నామినేషన్‌ను సాంకేతిక పరిశీలనలో రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ ప్రకాశ్ బజాజ్.. భారత ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. రిటర్నింగ్ అధికారిగా ఉన్న అశోక్‌కుమార్ కుట్ర చేశారని, ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం జరిగేంత వరకు ఫలితాలను వెల్లడించవద్దని తన ఫిర్యాదులో ప్రకాశ్ బజాజ్ విజ్ఞప్తిచేశారు.

ధరణితో క్షణాల్లో రిజిస్ట్రేషన్

-నల్లగొండలో ప్రారంభించిన ఎమ్మెల్యే

నల్లగొండ,నవంబర్3(ఆర్ఎన్ఎ): రైతులకు వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, పట్టా మార్పిడి (మ్యుటేషన్) వేర్వేరు కార్యాలయాలకు వెళ్లకుండా ఒకే కార్యాలయములో సేవలందించడం ద్వారా ముఖ్యమంత్రి కేసీర్ ఎంతో మేలు చేశారని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. నల్లగొండ తహసీల్దార్ కార్యాలయంలో ధరణి పోర్టల్‌ను ఆయన ప్రారంభించారు. పెద్ద సూరారానికి చెందిన రైతు పెండెం రామకృష్ణ కొనుగోలు చేసిన 5.17 ఎకరాల భూమికి రిజిస్ట్రేషన్ చేసి కేవలం 30 నిమిషాల్లో పట్టదారు పాస్ పుస్తకం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి సౌకర్యం దేశంలోనే ఏ రాష్ట్రంలో లేదన్నారు. ధరణి పోర్టల్ ద్వారా భూ రికార్డుల నిర్వహణ సులభతరమవుతందని పేర్కొన్నారు. ఎన్నో ఏండ్ల నుంచి ఉన్న భూ రికార్డుల నిర్వహణ సమస్యలకు పరిష్కారం ధరణి అని అన్నారు. కార్యక్రమంలో నల్లగొండ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, తహసీల్దార్ నగార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగు విస్తీర్ణం తగ్గడంతోనే ధరలు పెరుగుదల

ఉల్లి ధరలపై అధికారుల వివరణ

అనంతపురం,నవంబర్3(ఆర్ఎన్ఎ): జిల్లాలో ఉల్లి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిందని రైతులు, అధికారులు తెలిపారు. ఉల్లి ధరలు పెరగడానికి జిల్లాలో ఉల్లి సాగు తగ్గడం కూడా ఒక కారణంగా తెలుస్తోంది. జిల్లాలో రాయదుర్గం, గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి, యాడికి, రాయలచెరువు ప్రాంతాల్లో ఉల్లి సాగు అధికంగా ఉంటోంది. ఈప్రాంతాలన్నింటిలోకి రాయదుర్గం ప్రాంతం ఉల్లి సాగులో ముందు ఉంటోంది. ఈనేపథ్యంలోనే ఇప్పటికే ఆ ప్రాంతంలో ఉల్లి కోతలు పూర్తిగా అయిపోయినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఇక మిగిలిన ప్రాంతాల్లో ప్రస్తుతం ఉల్లి సాగులోనే ఉంది. ఈ ఖరీఫ్‌లో 2వేల హెక్టార్లలో పంట సాగైనట్లు ఉద్యాన శాఖ అధికారుల ద్వారా తెలుస్తోంది. గత ఏడాది జిల్లాలో దాదాపు 4500 హెక్టార్లలో ఉల్లి సాగైంది. ఈ ఏడాది దాదాపు సగానికి సగం సాగు తగ్గిపోయింది. బహిరంగ మార్కెట్‌ల్లో ఉల్లి ధరలు పెరగడంతో ప్రభుత్వ రాయితీ ఉల్లిగడ్డలకు డిమాండ్ పెరిగింది. ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రైతు బజార్లలో రాయితీపై కిలో రూ.40తో ఉల్లిగడ్డలు అందిస్తోంది. గతనెల 24వ తేదీ నుంచి జిల్లా కేంద్రంలోని రైతుబజారులో ఉల్లి విక్రయాలు ప్రారంభించారు. ప్రారంభం నుంచి రాయితీ ఉల్లి గడ్డల కోసం జనం క్యూ కడుతున్నారు. రోజుకు 5 టన్నులకు పైగా రాయితీ ఉల్లిగడ్డలు అయిపోతున్నట్లు రైతుబజారు అధికారులు చెబుతున్నారు. ప్రస్తు తం రైతుబజారులో మాత్రమే విక్రయిస్తున్నారు. త్వరలోనే వ్యవసాయ మార్కెట్ కమిటీల్లోను విక్రయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే మార్కెట్ కమిటీల్లోను ఉల్లి విక్రయాలు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. బహిరంగ మార్కెట్‌ల్లో మొదటి రకం ఉల్లి ధర రూ.100 ఉంటే ఆతరువాత రకం రూ.80 పలుకుతోంది. చిన్న సైజు ఉల్లిగడ్డలు సైతం రూ.60 పలుకుతున్నాయి. ఇటీవల కురిసిన అధిక వర్షాలతో ఉల్లి ధరలు అమాంతం పెరిగాయి. సాధారణంగా మహారాష్ట్ర, కర్నూలు నుంచి ఉల్లి దిగుమతి అయ్యేది. ప్రతి రోజు జిల్లాకు దాదాపు 200 నుంచి 300 టన్నుల వరకు ఉల్లి దిగుమతి జరుగుతున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన అధిక వర్షాల వల్ల మహారాష్ట్రలో పంట పూర్తిగా దెబ్బతింది. కర్నూలులోను ఇదే పరిస్థితి. ఈనేపథ్యంలో మహారాష్ట్రలోనే కిలో రూ.30కంటే ఎక్కువగా పలుకుతున్నట్లు తెలుస్తోంది. ఇక కర్నూలులోనూ రూ.40పైనే పలుకుతున్నాయి. దీంతో జిల్లాలో ఉల్లి ధరలు మరింతగా పెరిగాయి.

సంచయితపై రఘురామ ఆసక్తికర విషయాలు

ఆనందగజపతి కూతరు సంచయిత కాదని వెల్లడి

న్యూఢిల్లీ,నవంబర్3(ఆర్ఎన్ఎ): మాన్సస్ ట్రస్ట్ చైర్‌పర్సన్

పెండ్లి పనులు చేసినంత శ్రద్ధగా ఓటరు నమోదును చేపట్టాలి

ములుగు జిల్లాలో పట్టభద్ర ఓటు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర రెడ్డి తదితరులు.

ములుగు,నవంబర్3(ఆర్ఎన్ఎ): ఇంట్లో పెండ్లి పనులు చేసినంత శ్రద్ధగా ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. వరంగల్– ఖమ్మం – నల్గొండ నియోజక వర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంలో కొంత అయోమయం జరిగింది. గతంలో ఓటర్లుగా ఉన్నవారి నమోదు సరిగా జరగలేదన్నారు. ఆన్‌లైన్, ఆఫ్ లైన్ వల్ల కూడా కొంత ఇబ్బంది అయ్యింది.

అయితే వీటన్నిటినీ అధిగమించి మన వారందరినీ ఓటర్లుగా నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఒక్క ఓటర్‌ను నమోదు చేయకున్నా పల్లా రాజేశ్వర్ రెడ్డి గెలిచారు. మన అభ్యర్థి గెలుపు పై సందేహం లేదు. అయితే ప్రతిపక్షాలకు సరైన బుద్ధి చెప్పే విధంగా ఈ ఫలితాలు ఉండాలన్నది సీఎం కేసీఆర్ ఆలోచన అని వివరించారు. ఈరోజు ఈ ములుగు బ్రహ్మాండంగా అభివృద్ధి చెందింది అంటే దానికి కారణం సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. బిల్ట్ కార్మికులకు చేయాల్సిన పని అంతా చేస్తున్నామని సీఎం కేసీఆర్ చెప్పారు. కావున ఇప్పుడు ఎవరు గెలిస్తే పనులు అవుతాయి. ఎవరు చెపితే అవుతాయో ఆలోచించి ఓటు వెయ్యాలన్నారు. గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అంటే కనపడక పోయేది. త్వరలో కూర్చొని జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష చేయనున్నాం. ములుగు జిల్లా ఆఖరి ఆయకట్టు వరకు నీరు ఇచ్చి సస్య శ్యామలం చేసే బాధ్యత మాదని హామీనిచ్చారు. మిగిలిన ఓటర్ల నమోదు పూర్తి చేయాలని టీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు, రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎంపీ మాలోతు కవిత, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్, వైస్ చైర్మన్ నాగ జ్యోతి, ఎమ్మెల్సీ ఎన్నికల బాధ్యులు గోవింద్ నాయక్, హరిబాబు, భవాని, శ్రీదేవి, శ్రీనివాస్ రెడ్డి, పల్లా బుచ్చయ్య, రజిత, వాణిశ్రీ, చంద్రయ్య, రామాచారి, రుద్రమదేవి, భిక్షపతి, సమ్మయ్య, సునిల్ కుమార్, రమేష్, శ్రీధర్ ఇతర స్థానిక నేతలు పాల్గొన్నారు.

గెలిచినా ఓడినా కాంగ్రెస్‌లోనే ఉంటా

ఫేక్‌న్యూస్ ప్రచారం చేస్తున్నారన్న శ్రీనివాసరెడ్డి

సిద్దిపేట,నవంబర్3(ఆర్ఎన్ఎ): తాను కాంగ్రెస్‌ను వీడే ప్రశ్నేలేదని దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాసరెడ్డి చెప్పారు. తాను టీఆర్ఎస్‌లో చేరినట్లు సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఆర్ఎస్‌లో ఎప్పటికీ చేరనని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. గెలిచినా.. ఓడినా కాంగ్రెస్‌లోనే ఉంటానన్నారు. బీజేపీ నేత రఘునందన్‌రావు, మంత్రి హరీష్ రావు కలిసి ఓటమి భయంతో ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్నారని, ఇది సిగ్గుమాలిన చర్యంటూ శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. ఈ ఫేక్ న్యూస్‌ను ప్రజలు నమ్మవద్దని కోరారు. చిన్న గొడవ జరిగితే గత రాత్రి 2 గంటల వరకు పోలీస్ స్టేషన్‌లోనే ఉన్నానని, తన వెనుక పోలీస్ షాడో టీమ్ కూడా ఉందని ఆయన చెప్పారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు టీఆర్ఎస్, బీజేపీలు కుట్రపన్నాయన్నారు. కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని తన తండ్రిపై ప్రమాణం చేసి ప్రతి గ్రామంలో చెప్పానని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తాను టీఆర్ఎస్‌లో చేరినట్లు కొన్ని ఛానెళ్లలో వస్తున్న వార్తలు తప్పు అని చెరుకు శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఓటమి భయంతో టీఆర్ఎస్, బీజేపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తన విజవల్, కారు నెంబర్ మార్ఫింగ్ చేశారని ఆరోపించారు. రాత్రి 11 గంటలకు గొడవ జరిగితే తొగుట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశానని... పీఎన్ నుంచి తెల్లవారుజామున 2 గంటలకు బయటికి వచ్చినట్లు తెలిపారు. తన వెంట రాత్రి పోలీసు షాడో పార్టీ, ఎస్ఐ ఉన్నారన్నారు. దుబ్బాక నియోజకవర్గ ప్రజలు టీఆర్ఎస్, బీజేపీ నేతలు చేస్తున్న అబద్ధపు ప్రచారం నమ్మవద్దని శ్రీనివాసరెడ్డి తెలిపారు.

కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ

రాజన్న సిరిసిల్లా, నవంబర్ 3 (నేటినిజం ప్రతినిధి)ః కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొనరావుపేట్ మండల కేంద్రంలో మంగళవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు .ఈ సందర్భంగా కోనరావుపేట మండలం బ వుసాయిపేట గ్రామ ఎంపిటిసి ఫిరోజ్ పాషా మాట్లాడుతూ కేంద్రంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో అమలు చేసిన రైతు చట్టం రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సన్నరకం ధాన్యం పంట సాగు విధానాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు . సన్న రకం ధాన్యం కు ప్రభుత్వం 25 వందల మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మందాల లింగయ్య, శివం గల రాము లు, మంగిని పల్లి శంకర్, ముద్దం సత్యం ,బోయిని దేవరాజ్ ,అనిల్ యాదవ్ ,సత్తన్న, ధర్మన్న, బాపురెడ్డి, నిత్యానందం తదితరులు పాల్గొన్నారు

రైతు వ్యతిరేక విధానాలను అవలంబించడం సరికాదు

రాజన్న సిరిసిల్లా, నవంబర్ 3 (నేటినిజం ప్రతినిధి)ఃకాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆది శ్రీనివాస్...కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంభించడం సరికాదని వేములవాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆది శ్రీనివాస్ అన్నారు, చందుర్తి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు, ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ మాట్లాడుతూకేంద్ర ప్రభుత్వం ఈ మధ్య కాలంలో మూడు రకాల కొత్త వ్యవసాయ బిల్లులను ప్రవేశపెట్టి రైతులపై ఎలాంటి పట్టింపు లేకుండా రైతులను గాలికి వదిలేసి చేతులు దులుపుకోవడం బాధాకరమన్నారు,ఈ చట్టాల వల్ల మార్కెట్ వ్యవస్థ పూర్తిగా మూతపడిపోయి, కార్పోరేట్,దళారుల చేతిలో రైతులు పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు, కొత్త రైతు బిల్లు ద్వారా రైతులకు రక్షణ లేకుండా పోయి ప్రైవేటు వ్యాపారుల కబంధ హస్తాల్లో రైతులు చిక్కుకొని, రైతులు వారి యొక్క సొంత భూములలో కూడా కాంట్రాక్ దళారి చెప్పినటువంటి పంటలు మాత్రమే వేయాల్సిన పరిస్థితులు వస్తాయన్నారు, అలాగే రైతులు పండించిన పంటలు వారికే వారు నిర్ణయించిన ధరలకే అమ్ముకునే దీన పరిస్థితిలు పొంచి ఉన్నాయన్నారు, దీని వల్ల రైతులకు వారు పండించిన ధాన్యాలు,నిత్యావసర వస్తువుల నిలువలు కూడా చేసుకునే అవకాశం కూడా ఉండదన్నారు, అది కూడా దళారులు,కార్పొరేట్ వ్యాపారులు మాత్రమే నిలువ చేసుకొని అధిక లాభాలను వారే ఘడిస్తారు.

తద్వారా ఇటు రైతులు అటు వినియోగదారులు పెద్ద ఎత్తున నష్టపోతారన్నారు, రైతు పక్షపాతిగా గొప్పలు చెప్పుకునే కేసీఆర్ ప్రభుత్వం ఇలాంటి రైతు వ్యతిరేక బిల్లులను వ్యతిరేఖించాల్సిన భాధ్యతను మరిచి నిమ్మకు నీరెత్తినట్లు అంటీముట్టకుండా వ్యవహరించటం ఎంతవరకు సమంజసం అని ఆయన మండిపడ్డారు, రాష్ట్రంలో వ్యవసాయం పైన పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవాలి కానీ కేంద్ర ప్రభుత్వంను ఎందుకు గట్టిగా వ్యతిరేకిస్తులేదో రైతులకు తెలియాల్సి అవసరం ఉందన్నారు, ముఖ్యమంత్రి కేసీఆర్ గారు చెప్పిన మాటలు వరి సాగు తగ్గించాలని,సన్న రకపు వరిధాన్యం పండించాలని,పత్తి సాగు పెంచి వేసుకొమ్మని చెప్పి ఇప్పటి వరకు అధిక వర్షాభావ పరిస్థితులలో పత్తి, వరి సాగు చేసిన రైతులు పంటలు దెబ్బతిని సగం దిగుబడి కూడా రాలేని పరిస్థితిలో ఉంటేరైతులకు నష్టపరిహారం ఇచ్చి భరోసా ఇవ్వవలసిన ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఎద్దేవా చేశారు, సన్న రకాలకు మద్దతు ధర ఇప్పటి వరకు ప్రకటించలేదు.కనీసం ధర సన్న రకానికి 2500/ రూపాయల చొప్పున ఇచ్చి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పైన ఉంది అని అన్నారు.

ముఖ్యమంత్రి గారే స్వయంగా చెప్పిన నియంత్రిత వ్యవసాయం లో భాగంగా పండించిన పత్తి కి కొనుగోలు కేంద్రాలు ఇప్పటివరకు తెరువక పోవడం శోచనీయం, నష్టపోయిన పంటలను అంచనా వేసి నష్టపరిహారం ఇవ్వకపోవడం, ప్రస్తుతం నష్టపోగా మిగిలిన ధాన్యాన్ని కల్లాలలో పోస్తున్నారు ఇప్పుడు వారి నష్టాన్ని ఎలా అంచనా వేస్తారో రైతులకు సమదానం చెప్పాలి అని డిమాండ్ చేశారు.రైతు రుణమాఫీ పేరుతో రెండవ సారి గద్దెనెక్కిన తరువాత రెండు సార్లు బడ్జెట్ సమావేశాలు జరిగినప్పటికి రైతు ఋణమాఫి ఊసే ఎత్తకపోవడం రైతులను కేసీఆర్ ప్రభుత్వం మోసం చేసినట్లే అన్నారు.కొత్త రెవెన్యూ చట్టం వల్ల రైతులకు ఒరిగింది ఏమి లేదు.కొత్త ఒవెన్యూ చట్టం తెచ్చామని ఎమ్మెల్యేలు, మంత్రులు సంకలు గుద్దుకుంటు ఊరేగింపులు చేస్తున్న, ఇప్పటి వరకు 10 లక్షల రైతు పాస్ పసుపుస్తకాలు పెండింగులో ఉన్న సంగతి మరిచిపోయారేమో వారు గుర్తు చేసుకోవాలన్నారు.ఇవన్నీ మరిచిన తెలంగాణ ప్రభుత్వం కూడా కేంద్రం తెచ్చిన రైతు వ్యతిరేక బిల్లులకు మాత్రం వెనకనుండి సహకరిస్తుందని అనుమానం వ్యక్తం అవుతోంది అని ఆది శ్రీనివాస్ అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, నాయకులు అంచ రాంరెడ్డి,గొట్టె ప్రభాకర్ నేతి కుంట జలపతి, పులి సత్యం, వేల్పుల దేవ స్వామి, ఇందూరి మధు,చిలుక భూమేష్ దేవుడు మల్లేశం, పోతరాజు రవి,సంటి ప్రసాద్,బొజ్జ మల్లేశం,దారం చంద్ర0, డబ్బటి వెంకటన్న, కాసారం శ్రీనివాస్ రెడ్డి, నేగురి రవి,లింగంపల్లి అజయ్, రేషనీ రామస్వామి,పిల్లి కొమురయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పత్తి తేమను 20శాతానికి పెంచాలి

సిసిఐ చైర్మన్‌కు నిరంజన్ రెడ్డి వినతి

హైదరాబాద్,నవంబర్3(ఆర్ఎన్ఎ): పత్తి కొనుగోళ్లలో కీలకంగా ఉన్న తేమశాతాన్ని పెంచాలని కాటన్ సిసిఐని తెలంగాణ ప్రభుత్వం కోరింది. కనీసం దీనిని 20శాతం వరకు పెంచాలని కోరింది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్‌తో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి సమావేశమై పత్తి కొనుగోళు ,, నిల్వలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. పత్తి కొనుగోళ్లలో తేమ శాతాన్ని పెంచాలన్నారు. సీసీఐ నిబంధనలు వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో పత్తి చేలు నీటిలో మునిగిపోయాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత సీసీఐ నిబంధనల ప్రకారం రైతులు భారీగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. 12 శాతం తేమ నిబంధనను 20 శాతానికి సవరించి కొనుగోలు చేయాలని కోరారు. 2019-20 ఏడాదికి 49.56 లక్షల పత్తి బేళ్లను కాటన్ కార్పొరేషన్ నిల్వ చేయగా, అందులో 9.28 లక్షల బేళ్లను మాత్రమే తరలించడం జరిగిందని తెలిపారు. పాత నిల్వలను వెంటనే తరలించి, కొత్తగా కొనుగోలు చేసిన పత్తి నిల్వ చేయాలని మంత్రి నిరంజన్ రెడ్డి కోరారు.

కరోనాకు హోమియో వైద్యం

చికిత్స చేసిన వైద్యుడిని అభినందించిన మాజీ ఎంపి రాపోలు

హైదరాబాద్,నవంబర్3(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారికి సరైన, ధీటైన వైద్యం తన దైన శైలిలో హోమయో తో సాధ్యం చేస్తున్న వైద్యులు డాక్టర్ సుభాష్ చందర్ కృషి అభినందనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు రాపోలు ఆనంద భాస్కర్ అన్నారు. ఇటీవల ఆయన కరోనా బారిన పడ్డారు. రాంనగర్ గుండు వద్ద తన నివాసంలో కరోనా కు హోమియో చికిత్స తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యానికి సైతం అంతుచిక్కని ప్రశ్నగా మారుతున్న కరోనా చికిత్స కోసం ఎందరో వైద్యులు ఎనలేని కృషి చేస్తున్నారని ,ఇటువంటి తరుణంలో వైద్య విధానంలో నవీన పద్ధతుల ద్వారా డైనమిక్ ఆటో హీమో థెరపీతో కరోనాను సైతం సవాలు చేయగల వైద్యంతో సుభాష్ చందర్ వంటి వైద్యులు సభ్య సమాజానికి నమ్మిక కల్గించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణా పద్మశాలి అఫిషియల్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మాచన రఘునందన్ మాట్లాడుతూ.. సేవాభావంతో వైద్యం చేస్తున్న వైద్యులు డాక్టర్ గ్దదె సుభాష్ చందర్ న్యూ లైఫ్ హోమియో చొరవతో పలువురు పాత్రికేయులు , సంఘ సేవకుల దీర్ఘ కాలిక ఆరోగ్య సమస్యలకు వైద్యం అందించడం జరిగిందని వివరించారు. డాక్టర్ సుభాష్ చందర్ మాట్లాడుతూ వైరస్‌లతో మానవాళికి, జంతుజాలానికి సంక్రమించే జబ్బులను తన ప్రత్యేక వైద్య విధానం డీ ఏ హెచ్ టీ చికిత్సతో కొన్ని ఏళ్లుగా సత్వర నివారణ సాధ్యమయ్యేలా వైద్యసేవలను కొనసాగిస్తున్నానని వివరించారు. కరోనా ఎన్ని రూపాలు సంతరించుకున్నా.. దానికి ధీటైన వైద్యం హోమయోతో సాధ్యం అన్నారు.

తేజస్వీ యాదవ్ సిఎం అవుతారు: రబ్రీదేవి

పాట్నా,నవంబర్3(ఆర్ఎన్ఎ): బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అత్యంత కీలకమైన రెండో దశలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు క్యూ కట్టారు. మొత్తం 94 అసెంబ్లీ స్థానాలకు గాను 17 జిల్లాల్లో 41,362 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు 3 దశల్లో ఎన్నికలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఓటు హక్కును వినియోగించుకున్న బీహార్ మాజీ సీఎం రబ్రీదేవీ మాట్లాడుతూ..మహాకూటమి తరపున సీఎం అభ్యర్థిగా భావిస్తున్న ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్(రాఘోపుర్), ఆయన సోదరుడు తేజ్‌ప్రతాప్ యాదవ్(హసన్‌పుర్) పోటీ చేస్తున్నారు. రాఘోపుర్ నుంచి పోటీ చేస్తున్న తేజస్వీ యాదవ్ బీహార్ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. తమ అలయన్స్ అభ్యర్థులు ఏ అసెంబ్లీ నియోజవర్గం నుంచి పోటీ చేసినా గెలుస్తారని బీహార్ మాజీ సీఎం రబ్రీదేవీ జోస్యం చెప్పారు.

కరోనా కేసులు తగ్గుముఖం

భయపడాల్సిన పనిలేదు

జనగామ,నవంబర్3(ఆర్ఎన్ఎ): కరోనాకు భయపడకండి... తీవ్రత తగ్గింది... నియోజకవర్గంలో కరోనా కేసులు రోజు రోజుకి తగ్గుముఖం పడుతున్నాయని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామిణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు భరోసా ఇచ్చారు. భయపడాల్సిన పనిలేదు...అంటూ ఒకవైపు కరోనా బాధితులు ధైర్యం కల్పిస్తూ మరోవైపు కరోనా బాధితులు నిరుపేదలు ఉంటే వారిని ఆదుకోవాలని ప్రజాప్రతినిధులకు ఆదేశిస్తూ... తనదైన శైలిలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ కరోనా కేసులు పాలకుర్తి నియోజకవర్గంలో రోజు రోజుకి తగ్గుతున్నాయి కాబట్టి భయపడాల్సిన పని లేదన్నారు. గత రెండు మూడు రోజులుగా పాలకుర్తి నియోజకవర్గంలో మొత్తం అయిదారు కేసులు నమోదవ్వడం మంచి పరిణామవన్నారు.కరోనా మహమ్మారి పూర్తిగా తొలగిపోయే వరకు మాస్కులు ధరిస్తూ, భౌతిక దూరం పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

తెలంగాణలో కొత్త కాంగ్రెస్‌ని చూడబోతున్నారు

కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మాణిక్కం ఠాగూర్

హుబూబ్‌నగర్,నవంబర్3(ఆర్ఎన్ఎ): ఇక మీదట తెలంగాణలో కొత్త కాంగ్రెస్‌ని చూడబోతున్నారని ఆ పార్టీ సీనియర్ నేత మాణిక్కం ఠాగూర్ పేర్కొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మిషన్ 2023 లక్ష్యంగా కాంగ్రెస్ ముందుకుపోతోందన్నారు. బంగారు తెలంగాణ పేరుతో సీఎం కేసీఆర్ ప్రజల్ని మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. సంతకాల సేకరణ చేసి రాష్ట్రపతి, గవర్నర్‌కి అందిస్తామని ఠాగూర్ వెల్లడించారు. కేసీఆర్.. మోదీ సర్కార్‌కి భయపడుతున్నారని మాణిక్కం ఠాగూర్ విమర్శించారు.

అంబులెన్స్ ప్రారంభించిన ప్రభుత్వ విప్ బాల్క సుమన్

'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా మందమర్రి మార్కెట్‌లో అంబులెన్స్‌ను ప్రారంభించిన ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్

మంచిర్యాల,నవంబర్3(ఆర్ఎన్ఎ): 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ మందమర్రి మార్కెట్‌లో అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ అంబులెన్స్ మందమర్రి, క్యాతనపల్లి మున్సిపాలిటీలతో పాటు మందమర్రి మండల ప్రజలకు అందుబాటులో ఉండనుంది. గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా సుమన్ నియోజకవర్గానికి రెండు అంబులెన్సులను అందజేస్తానని హామీ ఇవ్వగా.. ఇప్పటికే తొలి విడతలో భాగంగా చెన్నూర్ పట్టణానికి ఒక అంబులెన్స్ అందజేశారు. అత్యంత అధునాతనమైన ఈ అంబులెన్సులో ఆక్సిజన్, వెంటిలేటర్ల సదుపాయం కూడా ఉంది. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ రేణికుంట్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బీహార్‌తో పాటు పలు రాష్ట్రాల్లో ఉప ఎన్నికలు

-ప్రశాంతంగా మొదలైన పోలింగ్

న్యూఢిల్లీ,నవంబర్3(ఆర్ఎన్ఎ): బిహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు దేశవ్యాప్తంగా పది రాష్ట్రాల్లో 54 స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. వీటిలో 28స్థానాలు కేవలం ఒక్క మధ్యప్రదేశ్‌లోనే ఉండటం, అక్కడ అధికార భాజపాకి కీలకంగా మారింది. ప్రస్తుతం అన్ని రాష్ట్రాల్లోనూ ప్రశాంతంగా ఓటింగ్ కొనసాగుతోంది. అన్ని పోలింగ్ బూత్‌లవద్ద థర్మల్ స్క్రీనింగ్, పీపీఈ కిట్లు ధరించిన సిబ్బందితోపాటు శానిటైజర్లు ఏర్పాటు చేయడం, ఓటర్లు భౌతిక దూరం పాటించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, నాగాలాండ్ మినహా మిగతా రాష్ట్రాల్లో ఓటింగ్ సాయంత్రం ఆరుగంటల వరకు జరుగుతుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లో 7 అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నిక జరుగుతోంది. మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఇక్కడ 29.27శాతం పోలింగ్ నమోదైంది. రాష్ట్ర మంత్రిగా ఉన్న చేతన్ చౌహాన్ కరోనా వైరస్ కారణంగా మరణించడంతో ఆ స్థానం ఖాళీ అయ్యింది. ప్రస్తుతం ఆయన భార్య సంగీత చౌహాన్ ఎన్నికల్లో నిలబడ్డారు. ఇక ఉన్నావ్ రేప్ కేసులో దోషిగా తేలిన కుల్‌దీప్ సింగ్ సెంగార్ జైలు శిక్ష అనుభవిస్తోన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆ స్థానంలోను ఉప ఎన్నిక జరుగుతోంది. ఉత్తర్‌ప్రదేశ్ ఉప ఎన్నికల్లో తొలిసారిగా ఆజాద్ సమాజ్ పార్టీ బరిలో దిగి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. హరియాణాలో ఈ ఉదయం ఓటింగ్ కాస్త మందకొడిగా సాగినప్పటికీ 1గంట వరకు ఇక్కడ 34.67శాతం పోలింగ్ నమోదైంది.మధ్యప్రదేశ్‌లో 28 స్థానాలకు ఉపఎన్నికలు జరుగుతున్నాయి. వీటిలో 27 కాంగ్రెస్ సిట్టింగ్ స్థానాలే కావడం విశేషం. అయితే, కాంగ్రెస్ నుంచి భాజపాలో చేరిన 25మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు ప్రస్తుతం భాజపా తరపున తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. మరో ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు అనారోగ్య కారణాల వల్ల చనిపోవడంతో ఆ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. ఇక్కడ 1గంట వరకు 42.71శాతం పోలింగ్ నమోదైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. గుజరాత్‌లోనూ ప్రస్తుతం ఎనిమిది స్థానాల్లో ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. జూన్‌లో జరిగిన రాజ్యసభ ఎన్నికల సమయంలో ఎనిమిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. అనంతరం వారిలో ఐదుగురు భాజపాలో చేరారు. దీంతో ఆ స్థానాల్లో ప్రస్తుతం ఉప ఎన్నిక జరుగుతోంది. 1గంట వరకు 35.66శాతం పోలింగ్ నమోదైంది.

కర్ణాటక, ఝార్ఖండ్, నాగాలాండ్, ఒడిశా రాష్ట్రాల్లో రెండు చొప్పున అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికలు జరుగుతుండగా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఒక్కొక్క స్థానంలో ఉప ఎన్నిక జరుగుతోంది.

మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి

నగర శివారు ఘట్కేసర్ ఆస్పత్రిలో అంబులెన్స్‌ను ప్రారంభించిన మంత్రి మలా

మేడ్చల్ మల్కాజిగిరి,నవంబర్3(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం ఘట్‌కేసర్ ప్రభుత్వ దవాఖాన ఆవరణలో దాతలు కీసర మండల టీఆర్ఎస్ నాయకులు తటాకం భానుచందర్ శర్మ, తటాకం నారాయణ శర్మ అందజేసిన అంబులెన్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని తెలిపారు. ప్రజలు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో ప్రతి ప్రభుత్వ ధవాఖానలో ప్రత్యేక అంబులెన్స్ వాహనాలను సమకూరుస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. దాతలను మంత్రి ఈ సందర్భంగా అభినందించారు.

తక్షణం నేతన్నలను ఆదుకోవాలి

ఉపాధి కోసం ప్రత్యేక మార్కెట్లు ఏర్పాటు చేయాలి: కోదండరామ్

వరంగల్,నవంబర్3(ఆర్ఎన్ఎ): కరోనాతో చేనేత కార్మిక కుటుంబాలు అవస్థలు పడుతున్నాయని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్ అన్నారు. వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపి ఆదుకోవాల్సి ఉందన్నారు.

మంగళవారం జిల్లాలోని కొత్తవాడలో చేనేత కార్మిక కుటుంబాల స్థితిగతులను కోదండరాం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అడిగితే అసలు నేత కార్మికులే లేకుండా చేయాలని ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. నేత కార్మికులు నేసే బట్టలు తెలంగాణ అస్థిత్వానికి ప్రతీక అని అన్నారు. వరంగల్ నేత కార్మికులకు ప్రసిద్ధి అని చెప్పుకొచ్చారు. నేత కార్మికులకు ప్రత్యేక మార్కెట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎగ్జిబిషన్‌లు పెట్టి నేతన్నల బట్టలకు ప్రచారం కల్పించాలన్నారు. బతుకమ్మ లేని తెలంగాణను ఎలా ఊహించుకోలేమో నేతన్నలు నేసే బట్టలను కూడా అలాగే ఊహించుకోలేమని చెప్పుకొచ్చారు. వరంగల్ టూరిజంలో నేతల కళను భాగం చేయాలని... వరంగల్‌కే వన్నె తెచ్చిన చేనేత పరిశ్రమను కాపాడాలని కోదండరాం డిమాండ్ చేశారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.